నేటి కందం-నేటికి అందం

పసగల పతకమ్ములతో
రసరమ్యంబైన రీతి ప్రతిభను జూపన్
కుసుమించిన మన దేశ
మ్ముసమానమ్మయ్యె నాసియా క్రీడలలోన్ !!

(పసిడి, రజత, కాంస్య పతకాలు అన్నీ కలిపి దాదాపు ఎనభై అయిదు సాధించి మన దేశం ఆసియా క్రీడల్లో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఈ అనూహ్య విజయం భారతీయులందరికీ గర్వకారణం.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

ఏకపక్ష నిర్ణయాల్తో
ఎన్నికల సంఘం
పట్టుపట్టి చేస్తుంది
ప్రజల ఓట్లు భంగం
చట్టానికి విరుద్ధంగా
సర్కారు చర్య రద్దు
సుప్రీంకోర్టు తేల్చి చెప్పే
సవరింపుకు సరిహద్దు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 7-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/98 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:57 పేజీలు:6 వెల: రూ.1/-


# ఇందిరమ్మ టవర్స్ కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, అక్టోబర్ 6: సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇ స్పష్టం చేశారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఏడాదిలోపే వీటిని పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం వేగవంతం చేసే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పుకొచ్చారు. ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షల ప్రోత్సాహకం అందిస్తామని పేర్కొన్నారు.

కుత్బుల్లాపూర్ గాజుల రామారంలో ఇళ్ల కోసం 7 వేల మందికి పైగా దరఖాస్తు చేశారని.. వీరిలో 5,218 మందిని అర్హులుగా గుర్తించామని మంత్రి పొంగులేటి తెలిపారు. బహిరంగ లక్కీ డ్రా ద్వారా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేశామని స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్‌లో మూడు విడతల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామని వివరించారు. ప్రస్తుతం 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని చెప్పుకొచ్చారు.

ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి ఇళ్ల నిర్మాణం చేపడతామని మంత్రి పొంగులేటి అన్నారు.

ఈ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు.

పేదల సొంతింటి కలను కార్యరూపంలోకి తెస్తున్నామని అన్నారు. 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఏపీలో పాకిస్థాన్ స్పై నెట్‌వర్క్ కలకలం

## ఏపీలో బయటపడిన కుట్రలు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 6: ఏపీలో గూఢచర్యం వ్యవహారం కలకలం రేపుతోంది. ఆపరేషన్ ఫైర్‌వాల్‌తో ఉగ్రవాదుల భారీ కుట్ర భగ్నం అయింది. కౌంటర్ ఇంటెలిజెన్స్ జరిపిన దాడుల్లో మొత్తం 18 మందిని గుర్తించగా వారిలో 13 మంది నేవీ సిబ్బంది అనుమానితులుగా గుర్తించారు.

12 కౌంటర్ ఇంటెలిజెన్స్ బృందాలతో 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో ఎన్‌క్రిప్టెడ్ ఛానళ్ల ద్వారా పాకిస్థాన్ కౌంటర్ ఇంటిలిజెన్స్‌తో నేరుగా టచ్‌లో ఉన్నట్లు గుర్తించారు. భారత్ కు చెందిన రహస్య సమాచారాన్నిసేకరించి పాక్ ఆపరేటివ్‌కు చేరవేసినట్లు సమాచారం. నేవీ, రక్షణ సంస్థల సమచారమే టార్గెట్‌గా గూఢచర్యం చేసినట్లు తెలుస్తోంది.. అనుమానితుల నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. విశాఖ పట్నం కేంద్రంగా గూఢచర్యం వ్యవహారం కొనసాగినట్లు ఏపీ సీఐ సెల్ గుర్తించింది. ఏపీ, కేరళ, మహారాష్ట్ర సహా 10 చోట్ల ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో మొ?త్తం ఇద్దరిని కౌంటర్ ఇంటిలిజెన్స్ సభ్యులు అరెస్ట్ చేశారు. మొ?త్తం 18 మందిలో ఇద్దరి పాత్రపై ప్రాథమిక ఆధారాలు లభించగా మిగతా 16 మంది అనుమానితులపై దర్యాప్తు కొనసాగుతోంది.

# మద్యం ధరలు పెంచితే తాగడం తక్కువ కాదు.. ఆదాయం పెరుగుతోంది: మంత్రి జూపల్లి



హైదరాబాద్, అక్టోబర్ 6:మద్యం ధరలు పెంచితే తాగడం తక్కువ కాదని.. ఆదాయం పెరుగుతుందని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కేసీఆర్ హయాంలో మద్యం విక్రయాల ద్వారా రూ.10 వేల నుంచి రూ.36 వేల కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఆ పదేళ్లలో మద్యం విక్రయాల ద్వారా 265 శాతం ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం మద్యం విక్రయాల ద్వారా రూ.40 వేల కోట్లు ఆదాయం వస్తుందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4 వేల కోట్ల ఆదాయం మాత్రమే పెరిగిందని గణాంకాలతో సహా ఆయన వివరించారు.

ఇక క్యూర్ అర్బన్ పరిధిలో 40 ఎక్స్‌ట్రా బార్లు వచ్చాయని చెప్పారు. అయితే బార్ షాపుల వాళ్లకు కూడా కాంపిటీషన్ ఉంటుందన్నారు. మిగతా రాష్ట్రాల్లో వలే తెలంగాణలో కూడా ఈ కాంపిటేషన్ ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

ప్రివిలేజ్ ఫీజు వల్ల బార్‌లకు ఎలాంటి నష్టం లేదని.. కానీ తాగేవారిపై కొంత భారం పడుతుందని మంత్రి జూపల్లి అన్నారు.

లిక్కర్ ఉత్పత్తికి నీటి కొరత రాదని స్పష్టం చేశారు. కృష్ణా వాటర్, డిండిపై సీఎం రేవంత్ రెడ్డితో సోమవారం సమీక్ష జరిగిందని గుర్తు చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఆయకట్టు పెంచుతూ పోయారని.. దానికి తగినట్లుగా వాటర్ సోర్స్ పెంచలేదని అన్నారు. ఏదుల రిజర్వాయర్ నుంచి కాకుండా శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి తీసుకుంటే తెలంగాణకు ఉపయోగం ఉంటుందని సీఎం రేవంత్‌కు వివరించామని తెలిపారు. ఏదుల నుంచి నీరు తీసుకోవడం వల్ల ఎదురయ్యే ఇబ్బందుల గురించి చెప్పామన్నారు.

అలాగే నల్లగొండకు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అచ్చంపేట మీదుగా నీరు ఇవ్వాలని కోరామని చెప్పారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండికి వాటర్ విషయంలో సమగ్ర విచారణ చేయాలని ఈ సంద్భంగా అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి గుర్తు చేశారు.

శ్రీశైలం ప్రాజెక్టులో 854 అడుగుల కంటే తక్కువ నీరు ఉంటే.. ఆ జాలాలను ఏపీ తీసుకెళ్లడానికి వీల్లేదని అప్పట్లో తాను స్టే తీసుకొచ్చానని వివరించారు. కర్ణాటక నుంచి వారం రోజులు తెలంగాణకు వాటర్ వచ్చాయని పేర్కొన్నారు. ఇంగ్లాండ్, లండన్‌లో కార్ వాషింగ్ చేయవద్దంటూ రూల్ పెట్టారని గుర్తు చేశారు. శ్రీశైలం నీటిని సాధ్యమైనంత మేరకు వాడుకుంటామని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు.

# దసరాకు కొత్త పింఛన్లు..

హన్మకొండ, అక్టోబర్ 6:(నేటినిజం ప్రతినిధి)రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకగా చేయూత పథకం కింద కొన్ని వర్గాలకు చేయూత పింఛన్లు మంజూరు చేయనుంది.

హనుమకొండ: రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకగా చేయూత పథకం కింద కొన్ని వర్గాలకు చేయూత పింఛన్లు మంజూరు చేయనుంది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఇప్పటికే స్వీకరించారు. అయితే ఎన్నో ఏళ్ల నుంచి పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులకు మాత్రం ప్రస్తుతం ఇవ్వడం లేదు. ఈ దఫా కేవలం వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులతో పాటు ఫైలేరియా, డయాలసిస్ బాధితులకు మాత్రమే కొత్త పింఛన్లు ఇవ్వనున్నారు. వీరి దరఖాస్తులను మాత్రమే ఆన్‌లైన్ చేయడంతో వాటిని మండలస్థాయి అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం విచారణను పూర్తి చేశారు.

హనుమకొండ జిల్లాలోని 14 మండలాల పరిధిలో నూతనంగా చేయూత పింఛన్ కోసం మొత్తం 15,025 దరఖాస్తులు నమోదయ్యాయి. వితంతువులు 7,583 దరఖాస్తు చేసుకోగా దివ్యాంగులు 3,990, కల్లుగీత కార్మికులు 1,584, ఒంటరి మహిళలు 991, చేనేత కార్మికులు 877, ఫైలేరియా బాధితులు 285, డయాలసిస్ బాధితులు 90 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను సూపరింటెండెంట్ క్యాడర్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేశారు. 13206 మందిని అర్హులుగా గుర్తించి అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. ఇందులో మండల స్థాయి అధికారులకు మరింత క్షుణ్ణంగా పరిశీలన చేసి ప్రక్షాళన చేపట్టనున్నారు. ఆ తర్వాత జిల్లాస్థాయి అధికార, యంత్రాంగం పరిశీలన చేసి నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు. జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు నూతన పింఛన్ అందుకోనున్నారు.

ప్రభుత్వం దసరా పండుగ కానుకగా అర్హులైన పేదలకు నూతన పింఛన్లు అందించేందుకు వేగంగా చర్యలు చేపడుతోంది. క్షేత్రస్థాయిలో పూర్తి పారదర్శకతతో దరఖాస్తుల విచారణ పూర్తి చేసి, ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకుండా లబ్ధిదారులను ఎంపిక చేస్తోంది. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టి, భాసటగా నిలిచేందుకు ప్రభుత్వం సన్నాహాలు వేగవంతం చేసింది. పండుగ వెలుగుల్లో ప్రతీ పేద కుటుంబం సంతోషంగా ఉండాలనే సత్సంకల్పంతో ఈ పింఛన్ల ప్రక్రియను శరవేగంగా కొలిక్కి తెచ్చింది. ప్రభుత్వం అందిస్తున్న ఈ దసరా కానుకపై లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# 6.6 శాతం నుంచి 7.1 శాతానికి పెంచిన ప్రపంచ బ్యాంకు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 6: భారత ఆర్థిక వ్యవస్థకు ప్రపంచ బ్యాంకు సానుకూల అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇలో దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 7.1 శాతం వృద్ధి చెందవచ్చని పేర్కొంది. గత ఏప్రిల్‌లో అంచనా వేసిన 6.6 శాతంతో పోలిస్తే తాజా అంచనాను 0.5 శాతం పాయింట్లు పెంచింది. అంచనాలకు మించిన ఆర్థిక కార్యకలాపాలు, బలమైన ప్రైవేటు వినియోగం, పెట్టుబడులే ఈ పెంపునకు ప్రధాన కారణాలుగా నిలిచాయి.

ఈజ27 తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఊహించిన దానికంటే మెరుగైన ఈ గణాంకం ప్రపంచ బ్యాంకు తాజా అంచనాలకు దోహదపడింది. దేశీయ డిమాండ్ బలంగా ఉండటంతో పాటు పెట్టుబడులు కూడా వృద్ధికి మద్దతుగా నిలిచాయని తెలిపింది.

రానున్న కాలంలోనూ ప్రైవేటు వినియోగం ఆర్థిక వృద్ధికి ప్రధాన చోదకంగా కొనసాగుతుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. ప్రభుత్వ పెట్టుబడులు పెరగడం, అనుకూలమైన ఆర్థిక పరిస్థితులు, విధానపరమైన మద్దతు కూడా వృద్ధికి బలం చేకూర్చనున్నాయని పేర్కొంది.

మరోవైపు భారత ఎగుమతులు అంచనాల కంటే మెరుగ్గా కొనసాగుతున్నాయని తెలిపింది. ఇవి వృద్ధి అంచనాలకు మరింత సానుకూలతను అందించే అవకాశం ఉందని పేర్కొంది. అయితే ప్రపంచ వాణిజ్యంలో అనిశ్చితి, భౌగోళిక రాజకీయ పరిణామాలు ప్రైవేటు పెట్టుబడులపై ప్రభావం చూపే అవకాశముందని హెచ్చరించింది.

సరఫరా వైపు చూస్తే పారిశ్రామిక కార్యకలాపాలు అంచనాలను అధిగమించాయని ప్రపంచ బ్యాంకు తెలిపింది. మౌలిక వసతులు, నిర్మాణ రంగానికి సంబంధించిన వస్తువుల ఉత్పత్తితో పాటు విద్యుత్ ఉత్పత్తిలోనూ బలమైన వృద్ధి నమోదైనట్లు పేర్కొంది.

నైరుతి రుతుపవనాల సమయంలో వర్షపాతం లోటు వ్యవసాయ రంగ అవకాశాలపై ప్రభావం చూపినట్లు ప్రపంచ బ్యాంకు తెలిపింది. దీని ప్రభావం గ్రామీణ ప్రాంతాల వినియోగ డిమాండ్‌పై స్వల్పంగా పడే అవకాశం ఉందని అంచనా వేసింది.

సేవల రంగం గత ఏడాది నమోదైన అధిక వృద్ధితో పోలిస్తే కొంత మందగించినప్పటికీ.. ఇప్పటికీ బలమైన స్థాయిలోనే కొనసాగుతోందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. మొత్తంగా చూస్తే దేశీయ వినియోగం, పెట్టుబడులు, ఎగుమతులు ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తుండటంతో భారత వృద్ధిపై ప్రపంచ బ్యాంకు తన అంచనాను పెంచింది.

# హోర్ముజ్ జలసంధి వద్ద నౌకపై దాడి.. 11 మంది భారతీయులకు గాయాలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 6: హోర్ముజ్ జలసంధి వద్ద ఒక నౌకపై జరిగిన దాడిలో 11 మంది భారతీయ సిబ్బంది గాయపడ్డారు. ఒమన్ తీరంలో మంగళవారం ఈ ఘటన జరిగినట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. హోర్ముజ్ జలసంధి వద్ద, ఒమన్ తీరంలో పనామాకు చెందిన ఎంటీ ఆన్ పీస్ అనే వాణిజ్య నౌకపై గుర్తు తెలియని వస్తువుతో దాడి జరిగింది. ఈ దాడిలో నౌకలో ఉన్న 12 మంది సిబ్బంది గాయపడ్డారు.

ఃవీరిలో 11 మంది భారతీయులు ఉన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో నౌకలో 19 మంది ఉండగా.. వారిలో 17 మంది భారతీయులు. ఈ ఘటనపై వెంటనే సమాచారం అందుకున్న ఒమన్ అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. నౌక వద్దకు చేరుకుని గాయపడిన వారిని రక్షించారు. బాధితుల్ని ఒమన్‌లోని ఖసాబ్‌లో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఈ దాడిని భారత్ ఖండించింది. భారతీయుల్ని రక్షించినందుకు ఒమన్ ప్రభుత్వానికి భారత్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై దాడులు జరుగుతుండటంపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

ఃవెంటనే కాల్పుల విరమణ పాటించాలని, ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం నెలకొనాలని భారత్ ఆకాంక్షించింది. వాణిజ్య నౌకలపై దాడి చేసి, సాధారణ ప్రజలు, నిర్మాణాలపై దాడి చేయడం సరికాదని ఇండియా వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ జలమార్గాలు స్వేచ్ఛా ప్రయాణం ఉండాలని సూచించింది. ఇక, ఈ దాడికి పాల్పడింది ఎవరు.. దేనితో దాడి జరిగింది అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. దీనిపై విచారణ కొనసాగుతోంది.

# మోదీపై ట్రంప్‌నకు చాలా మంచి అభిప్రాయం: ఆస్ట్రేలియా మాజీ ప్రధాని

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 6: భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చాలా మంచి అభిప్రాయం ఉందని ఆస్ట్రేలియా మాజీ ప్రధాని కెవిన్ రడ్ పేర్కొన్నారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం వంటి కీలక సాంకేతిక రంగాల్లో భారత్-అమెరికా ముందుకు సాగుతున్న సమయంలో కెవిన్ రడ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి

సుంకాలు, మార్కెట్ ప్రవేశంపై చర్చలు కఠినంగా ఉన్నప్పటికీ, అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య చర్చలలో భారతదేశం సాపేక్షంగా బలమైన స్థితిలో ఉందని రడ్ అన్నారు. ఇటీవల అమెరికాలో ఆస్ట్రేలియా రాయబారిగా తన పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న రడ్.. భారత్, ట్రంప్ ప్రభుత్వం మధ్య చర్చలు చురుకుగా కొనసాగుతున్నాయని, అంతిమ ఫలితం ఇద్దరు నాయకుల మధ్య రాజకీయ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అన్నారు.

ట్రంప్‌నకు భారత్ పట్ల ఉన్న సానుకూల దృక్పథం కారణంగా, అనేక ఇతర దేశాలతో పోలిస్తే భారత్ మెరుగైన స్థితిలో ఉందని రడ్ పేర్కొన్నారు. అలాగే రష్యా-ఉక్రెయిన్ ఘర్షణలో ప్రాణనష్టం తీవ్ర స్థాయికి చేరుకుందని, దౌత్య పరిష్కారానికి దోహదపడేందుకు భారతదేశం చేస్తున్న ప్రయత్నాలను తాను స్వాగతిస్తున్నానని రడ్ పేర్కొన్నారు. అలాగే జైశంకర్‌ను ప్రపంచవ్యాప్తంగా మంచి సంబంధాలున్న విదేశాంగ మంత్రిగా అభివర్ణించారు.

# సౌదీపై కొనసాగుతున్న హౌతీ దాడులు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియాపై హౌతీ ఉగ్రవాదుల దాడులు కొనసాగుతున్నాయి. సౌదీలోని కీలక స్థావరాలపై సోమవారం దాడి చేశామని హౌతీలు ప్రకటించారు. ఈ అంశంపై హౌతీ మిలిటరీ ప్రతినిధి యహ్యా సరీ మంగళవారం వివరాలు వెల్లడించాడు. సౌదీ అరేబియాలోని రియాద్ నగరంలో ఉన్న కింగ్ ఖలీద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌పై, రబిగ్‌లో ఉన్న అరాంకో రిఫైనరీపై దాడి చేసినట్లు చెప్పారు. డ్రోన్లు, బాలిస్టిక్ మిస్సైల్స్, క్రూయిజ్ మిస్సైల్స్‌తో దాడి చేసినట్లు వెల్లడించాడు.

అలాగే, దక్షిణ సౌదీ అరేబియాలోని కొన్ని చిన్న ఎయిర్‌పోర్టులపై కూడా దాడి చేసినట్లు తెలిపారు. హౌతీలు.. యెమెన్‌లోని ప్రత్యేక మిలిటెంట్ గ్రూప్. అక్కడ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేస్తుంటారు. యెమెన్ సైన్యానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు సైన్యం. దీనికి నిధులు, ఆయుధాల్ని ఇరాన్ సమకూరుస్తుంటుంది. ఇరాన్ మద్దతుతో హౌతీలు సౌదీ అరేబియాపై దాడి చేస్తున్నారు. రియాద్ సహా అనేక ప్రాంతాల్లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. అయితే, ఎక్కడ దాడి జరిగింది.. ఆస్తి నష్టం, ప్రాణం నష్టం, గాయపడిన వారి వివరాల్ని సౌదీ ప్రభుత్వం వెల్లడించలేదు.

# ఎవ్వరూ తప్పించుకోలేరు.. రాహుల్ గాంధీ హెచ్చరిక..

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 6: ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద విపక్షాల నిరసన కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. ఓటర్ల జాబితా అవకతవకలకు బాధ్యులైనవారెవరూ తప్పించుకోలేరని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా అక్రమాలపై తమ పోరాటం కొనసాగుతుందని ఆయన అన్నారు

ార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు ఇండియా కూటమి ఎంపీలు చేపట్టిన మార్చ్‌ను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఎన్నికల కమిషనర్లను కలిసేందుకు వచ్చారని రాహుల్ గాంధీ తెలిపారు. ఎన్నికల సంఘం కార్యాలయం కొద్ది దూరంలోనే ఉన్నప్పటికీ తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. తాము దేశ ప్రజల ప్రతినిధులమని, ఎన్నికల కమిషనర్లను కలవడం తమ హక్కు అని రాహుల్ గాంధీ అన్నారు

నిరసన సందర్భంగా బీజేపీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు . 'మేము వారిని కేవలం ఎదుర్కోవడం కాదు.. వారిని ఓడిస్తాం' అని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను తాను దేశద్రోహంగా భావిస్తున్నానని, దీనికి బాధ్యులైన వారు ఎవరూ తప్పించుకోలేరని ఆయన అన్నారు. తన పోరాటం ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికేనని రాహుల్ గాంధీ చెప్పారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పనైపోయిందని, ఆయన రాజీనామా చేసే సమయం ఆసన్నమైందని అన్నారు.

# న్యూట్రినోలను బంధించిన ఫ్రాన్సిస్ హాల్జన్‌కు ఫిజిక్స్‌లో నోబెల్




న్యూ ఢిల్లీ, అక్టోబర్ 6:భౌతిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ఫ్రాన్సిస్ హాల్జన్(ఈతీజీనిఇతిబ ఊజీశ్రీశివని)కు దక్కింది. ఐస్‌క్యూబ్ నూట్రినో అబ్జర్వేటరీకి సహకారం అందించినందుకు, ఖగోళానికి చెందిన అత్యంత శక్తివంతమైన న్యూట్రినోలను గుర్తించినందుకు ఆయనకు ఈ అవార్డును అందజేయనున్నారు. అమెరికాలోని మాడిసన్‌లో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ విస్కిన్‌సన్‌లో ప్రొఫెసర్‌గా చేస్తున్న ఫ్రాన్సిస్ హాల్జన్.. దక్షిణ ధ్రువంలో ఉన్న ఐస్‌క్యూబ్ ఆబ్జర్వేటరీ ద్వారా అంతుచిక్కని న్యూట్రినోలను బంధించి, అధ్యయనం చేయడంలో కీలక పాత్ర పోషించారు. దక్షిణ ధ్రువం వద్ద ఉన్న మంచుతో న్యూట్రినోలను ట్రాక్ చేయవచ్చు అని ఫ్రాన్సిస్ గుర్తించారు. అయితే ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీలో ఫ్రాన్సిస్ విజన్, నాయకత్వం కీలకంగా నిలిచినట్లు నోబెల్ కమిటీ పేర్కొన్నది. సుదూరు విశ్వంలో ఉన్న న్యూట్రినోలను ఐస్‌క్యూబ్ ద్వారా పరిశోధకులు పట్టుకుంటున్నట్లు తెలిసింది. విశ్వరహస్యాలను చేధించడంలో.. న్యూట్రినోలు కీలకం కానున్నట్లు ఖగోళ పరిశోధకులు భావిస్తున్నారు.

# పత్తి ఉత్పత్తిలో భారత్‌దే అగ్రస్థానం

## (07 అక్టోబర్ "ప్రపంచ కాటన్ (పత్తి) దినోత్సవం" సందర్భంగా)

మనిషి కనీస అవసరాల జాబితాలో కూడు, గూడు, గుడ్డ ముందు వరుసలో వస్తాయి. ప్రపంచ మానవుడు ధరించే వస్త్రాల తయారీకి ప్రకృతి ప్రసాదించిన ఏకైక ముడి సరుకుగా కాటన్ లేదా పత్తికి ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఐదు ఖండాల్లోని దాదాపు 80 దేశాల్లో పత్తి ఉత్పత్తి కొనసాగుతూ, ప్రపంచ మానవాళి వస్త్ర అవసరాలను తీర్చుతున్నది. ఆహారేతర పంటల్లో పత్తి ప్రధానమైనది. పత్తి చేసేతున్న మేలును దృష్టిలో పెట్టుకొని ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐరాసల చొరవతో ప్రపంచ దేశాలు ఏటా 07 అక్టోబర్ రోజు "ప్రపంచ పత్తి దినోత్సవం (వరల్డ్ కాటన్ డే)" పాటించుట 2019 నుంచి ఆనవాయితీగా మారింది. పత్తిని పండిస్తున్న దేశాల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా పేద చిన్న సన్నకారు రైతుల కుటుంబాల, ముఖ్యంగా మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంలో ప్రముఖంగా పాత్రను పోషిస్తోంది. వస్త్రాల తయారీలో వాడుతున్న ముడి నూలు సరుకుల్లో పత్తి అత్యంత ముఖ్యమైనది.

### మానవ జీవితాలు పత్తితో అవిభాజ్య సంబంధం:

కాటన్ వస్త్రాలు సౌకర్యవంతంగా, ఆరోగ్యవంతంగా, మన్నికగా, ఎలర్జీ లేకుండా, చవకగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతూ ఆకట్టుకుంటున్నాయి. మిలియన్ల గ్రామీణ రైతులకు జీవనోపాధి, సామాజిక ఉన్నతి కల్పించడంలో పత్తి సాగు, పత్తి ఆధార పరిశ్రమలు దోహదపడుతున్నాయి.

ప్రపంచ పత్తి దినోత్సవం-2026 ఇతివృత్తంగా "మంచి కోసం పత్తి : వాణిజ్యం, మార్పు, భాగస్వామ్యం ద్వారా శ్రేయస్సు పొందడం" అనే అంశాన్ని తీసుకొని విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రపంచ దేశాల ప్రభుత్వాలు, అధికారులు, పత్తి రైతులు, శాస్త్రవేత్తలు, స్కాలర్స్, రిటైల్ వ్యాపారులు, ప్రైవేట్ రంగాలు సంయుక్తంగా కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా నేడు ప్రపంచ మార్కెట్‌ను ముంచి వేస్తున్న కృత్రిమ నూలు పోగు వస్త్రాలతో పోల్చితే కాటన్ వస్త్రాలు అన్ని విధాలుగా మేలు చేస్తాయని సామాన్య ప్రజల్లో ప్రచారం చేయడం జరుగుతుంది.

### పత్తి ఉత్పత్తిలో భారత్ ముందంజ:

ప్రపంచవ్యాప్తంగా 24 మిలియన్లకు పైగా కాటన్ ఉత్పత్తి చేసే రైతులు ఉండగా 80 దేశాలకు చెందిన 100 మిలియన్లకు పైగా కుటుంబాలు పత్తి సాగుతో జీవనోపాధులను పొందుతూ, ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. ప్రపంచ దేశాల్లో కాటన్ ఉత్పత్తిలో భారత్, చైనాలు అగ్రస్థానంలో ఉంటూ దాదాపు 50 శాతం పత్తిని పండించడం జరుగుతోంది.

భారత్‌లో ముఖ్యంగా మహారాష్ట్రతో పాటు గుజరాత్, తెలంగాణ, ఆంధ్ర, రాజస్థాన్, ఎంపీ, కర్నాటక, హర్యానా, పంజాబ్, ఒడిసా రాష్ట్రాల్లో పత్తి పంట ప్రధానమైనదిగా మారింది. దేశవ్యాప్తంగా దాదాపు 50 మిలియన్ల భారతీయులు ఉపాధి పొందుతున్నారు.

పత్తి ఉత్పత్తి శృంఖలంలో అనేక మందికి, ముఖ్యంగా మహిళలకు ఉపాధి లభిస్తున్నది.

పేదరిక నిర్మూలనలో కూడా పత్తి ప్రధాన భూమికను నిర్వహిస్తోంది. పత్తి రైతులు, పత్తి ఆధార శ్రామికుల కళ్లల్లో ఆనందం చూడడానికి ప్రభుత్వాలు, సంబంధిత శాఖలు నిరంతరం కృషి చేయాలని కోరుకుందాం.



-మధుపాళీ
9949700037

# దేశవ్యాప్తంగా "నషా ముక్త్ యువత- నడక" కార్యక్రమాన్ని నిర్వహించిన మై భారత్ 150 ప్రాంతాల్లో కార్యక్రమం..

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 6:"నషా ముక్త్ యువత- వికసిత్ భారత్" (అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాన్ని సాధించడానికి వీలుగా యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా వారిని చైతన్యాన్ని కలిగించడం) ఉద్యమంలో భాగంగా, మై భారత్‌తో పాటు మై భారత్ భాగస్వామ్య సంస్థలు ఈ నెల 4న దేశమంతటా 150 కన్న ఎక్కువ చోట్ల "వాక్ ఫర్ నషా ముక్త్ యువా" కార్యక్రమాన్ని నిర్వహించాయి. యువతీ యువకులు, పౌరులు కలిపి లక్ష కన్న ఎక్కువ మంది ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

మత్తు పదార్థాలను ఉపయోగించడానికి అలవాటు పడడం వల్ల కలిగే హానికర ఫలితాలను గురించి యువతను, సమాజాన్ని అప్రమత్తం చేయడమే కాక ఆరోగ్యప్రద, బాధ్యతాయుత, వ్యసనాలకు చోటివ్వని జీవన శైలుల పట్ల అవగాహనను పెంపొందింప చేయడం కూడా ఈ జాతీయ స్థాయి కార్యక్రమ లక్ష్యాలుగా ఉన్నాయి.

మాదకద్రవ్యాల జోలికి పోని ఆరోగ్యకర సమాజాన్ని ఆవిష్కరించడం ప్రజలందరి బాధ్యత అనే సందేశాన్ని దేశం నలు మూలలకూ విస్తరింపచేసేందుకు యువజనులు, పౌరులు, ప్రజాప్రతినిధులతో పాటు భాగస్వామ్య సంస్థలను ఈ "వాక్ ఫర్ నషా ముక్త్ యువా" కార్యక్రమం ఏకతాటి మీదకు తీసుకు వచ్చింది. ఈ కార్యక్రమంలో భాగంగా 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం నడవడం, వీధి నాటకాల ప్రదర్శన, నినాదాలు రాయడం, హెరిటేజ్ వాక్‌లో పాలుపంచుకోవడం వంటి యువజన చైతన్య ప్రబోధ కార్యకలాపాలను చేపట్టారు. మత్తు పదార్థాల సేవనంతో ముడిపడిన అపాయాల పట్ల చైతన్యాన్ని కలిగించడం కోసం బహిరంగ స్థలాలను ఎంపిక చేసుకున్నారు. కార్యక్రమాల్లో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొనేటట్లుగా చొరవ తీసుకున్నారు. శరీరానికి హితకరంగా ఉండే అలవాట్లను జీవిత విధానంలో భాగం చేసుకోవాలంటూ యువతను ప్రోత్సహించారు.

నషా ముక్త్ యువా ప్రతిన స్వీకరించడాన్ని ఒక భాగం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు తాము మత్తు పదార్థాలను ఉపయోగించబోమనీ, స్వస్థ, జాగరూక, మాదకద్రవ్యాలకు చోటు ఇవ్వని సమాజాన్ని నిర్మించడంలో తమ వంతు పాత్రను పోషిస్తామనీ వాగ్దానం చేశారు. మాదకద్రవ్యాల సేవనానికి వ్యతిరేకంగా వ్యక్తిగత స్థాయిలో పూచీపడడంతో పాటు, ఉమ్మడి చర్యలకు ముందుకు రావాలనే సందేశాన్ని కూడా ఈ ప్రతిన ద్వారా అందించారు.

జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు. వారిలో ఇద్దరు లెఫ్టినెంట్ గవర్నర్లు, కేబినెట్ మంత్రి, ఎనిమిది మంది పార్లమెంట్ సభ్యులు, ఎనిమిది మంది శాసన సభ్యులు ఉన్నారు.

యువజనులు, పౌరులు, ప్రజా ప్రతినిధులతో పాటు భాగస్వామ్య సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఉత్సాహంగా ముందుకు వచ్చాయి. వికసిత్ భారత్ ఆశయాన్ని సాధించడానికి యువతను మత్తు పదార్థాల వాడకానికి బానిసలు కాకుండా చూడాలన్న సమష్టి సంకల్పానికి ఈ కార్యక్రమం అద్దం పట్టింది. ఆరోగ్యప్రద, శక్తిమంత, అభివృద్ధి చెందిన భారత్ ఏర్పాటు దిశగా వడివడిగా అడుగులు వేయడానికి యువత శారీరక స్వస్థత పట్ల శ్రద్ధ వహించేటట్లు చైతన్యపరచడం ముఖ్యమన్న సందేశాన్ని ఈ కార్యక్రమంతో అందించారు.

వికసిత్ భారత్ ఉద్యమం సఫలం కావాలంటే యువత మత్తుమందుల వలలో చిక్కుకోకుండా చూడాలన్న స్థూల ఉద్దేశంతో "వాక్ ఫర్ నషా ముక్త్ భారత్"ను నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగ ముప్పును ఎదుర్కొని సమర్థంగా పరిష్కరించడానికి అవగాహన కార్యక్రమాలను తరచుగా నిర్వహించడం, వాటిలో యువజనులు పాల్గొని విషయాలను గ్రహించేలా శ్రద్ధ వహించడం, ఉమ్మడి చర్యలను చేపట్టడం ద్వారా యువతీయువకుల, సమాజాల మద్దతును కూడగట్టే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

# పత్తి రైతులకు సాధికారత కల్పించి పారదర్శకతతో భారత్ పత్తి విలువ శ్రేణిని బలోపేతం చేయడమే లక్ష్యంగా సంస్కరణలకు ప్రాధాన్యం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 6 :సంస్కరణల ఉత్సవం (రిఫార్మ్ ఉత్సవ్ 2026) లో భాగంగా కేంద్ర జౌళి శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ రంగ భారత పత్తి సంస్థ (సిసిఐ) అక్టోబర్ 6, 2026న తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఒక ప్రత్యేక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించనుంది. పత్తి కొనుగోలు వ్యవస్థను రైతు సంక్షేమ ఆధారితంగా, అత్యంత పారదర్శకంగా, సాంకేతిక పరిజ్ఞానంతో వేగవంతంగా మార్చేందుకు జౌళి మంత్రిత్వ శాఖతో కలిసి సిసిఐ చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించనున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు, విధాన నిర్ణేతలు, రైతులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు, పత్తి, జౌళి రంగాలకు చెందిన ఇతర భాగస్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. క్షేత్రస్థాయిలో సంస్కరణలు తెచ్చిన మార్పులను ప్రముఖంగా తెలియజేయడానికి, పత్తి విలువ శ్రేణిలోని ప్రధాన భాగస్వాముల మధ్య అనుభవాల మార్పిడికి ఈ కార్యక్రమం ఒక వేదికగా నిలవనుంది.

గత కొన్ని సంవత్సరాలుగా, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి సేకరణ, రైతుల నమోదు, డిజిటల్ స్లాట్ బుకింగ్, నేరుగా ఖాతాల్లోకి చెల్లింపులు, నాణ్యత నిర్ధారణ, ఉత్పత్తుల సమాచార పర్యవేక్షణ, పత్తి విక్రయాలు, భాగస్వాముల అనుసంధానం వంటి అంశాలలో అనేక సాంకేతిక, సంస్థాగత సంస్కరణలను చేపట్టింది. సులభ వ్యాపార నిర్వహణను మెరుగుపరచడం, పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం, పత్తి రైతులకు మరింత సమర్థవంతంగా సేవలను అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు తోడ్పడుతున్నాయి.

ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా సీసీఐ చేపట్టిన కీలక సంస్కరణలు, కార్యక్రమాలపై ప్రత్యేక ప్రదర్శన ఉంటుంది. వాటి అమలు, ప్రభావాన్ని ప్రతిబింబించే లఘు చిత్రాన్ని కూడా ప్రదర్శిస్తారు. డిజిటల్ సాంకేతికతలు, ప్రక్రియల పునర్వ్యవస్థీకరణ ద్వారా సంప్రదాయ విధానాలు ఏ విధంగా మార్పు చెందుతున్నాయి, రైతులు, సీసీఐ, జిన్నర్లు, వస్త్ర పరిశ్రమ మధ్య మరింత మెరుగైన సమన్వయం ఎలా ఏర్పడుతోంది - అనే అంశాలను ఈ ప్రదర్శన వివరిస్తుంది.

ఈ కార్యక్రమంలో పత్తి రైతులు, పరిశ్రమకు చెందిన భాగస్వాములు తమ అనుభవాలను పంచుకోనున్నారు. సంస్కరణల అమలులో భాగస్వాములుగా ఉన్నవారు, వాటి ద్వారా ప్రయోజనం పొందుతున్నవారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు ఇది అవకాశం కల్పిస్తుంది. పత్తి నాణ్యత మెరుగుదల, అధిక సాంద్రత మొక్కల పెంపకం విధానం (హై డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టమ్ - హెచ్‌డీపీఎస్) కస్తూరి కాటన్ భారత్, పత్తి సేకరణలో డిజిటలీకరణ, పత్తి విలువ వ్యవస్థను బలోపేతం చేసేందుకు చేపడుతున్న ఇతర చర్యలపై చర్చలు జరుగుతాయి.

ప్రధానంగా ప్రదర్శించనున్న కార్యక్రమాల్లో కపాస్ కిసాన్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఒకటి. రైతుల నమోదు, స్లాట్ బుకింగ్, పత్తి సేకరణకు సంబంధించిన సమాచార మార్పిడి, ఆధార్ ఆధారిత చెల్లింపులు వంటి పత్తి సేకరణ ప్రక్రియలోని వివిధ దశలను ఈ ప్లాట్‌ఫామ్ డిజిటల్ విధానాల ద్వారా ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. ఈ కార్యక్రమాలను పారదర్శకతను పెంపొందించడం, ప్రక్రియలోని సంక్లిష్టతలను తగ్గించడం, పత్తి సేకరణ ప్రక్రియపై రైతులకు మరింత స్పష్టమైన అవగాహన కల్పించడం లక్ష్యంగా చేపడుతున్నారు.

ఈ కార్యక్రమంలో భారత పత్తి నాణ్యతను మెరుగుపరచడం, దాని ఉత్పత్తి నుంచి సేకరణ వరకు వివరాలను గుర్తించే ట్రేసబిలిటీని బలోపేతం చేయడం కోసం సీసీఐ చేపడుతున్న చర్యలను కూడా ప్రదర్శించనున్నారు. ఇందులో కలుషితాలను నియంత్రించడం, డిజిటల్ ట్రేసబిలిటీ, కస్తూరి కాటన్ భారత్ కార్యక్రమం కింద అత్యుత్తమ నాణ్యత కలిగిన పత్తిని ప్రోత్సహించడం వంటి చర్యలు ఉన్నాయి. ఈ చర్యల ద్వారా భారతీయ పత్తికి ప్రత్యేక గుర్తింపు కల్పించడం, నాణ్యతను పెంచడం, మార్కెట్‌లో దాని స్థాయిని మెరుగుపరచడం, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ పత్తికి మరింత ఆదరణ లభించేలా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ ప్రదర్శనలో హై డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టమ్ తో పాటు, సంబంధిత వ్యవసాయ సంస్థల సహకారంతో ప్రోత్సహిస్తున్న ఉత్పాదకత పెంపు చర్యలపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. భారతీయ పత్తి ఉత్పాదకతలో ఉన్న అంతరాన్ని తగ్గించడం, రైతు స్థాయిలో ఆదాయాన్ని మెరుగుపరచడం, మొత్తంగా భారతీయ పత్తి రంగం పోటీతత్వాన్ని పెంచడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యాలు.

భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర సిల్క్ బోర్డు (సీఎస్బీ) డిజిటల్ సేవల అందజేత, మిషన్ ప్రాతిపదికన సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, వినూత్న అవగాహన కార్యక్రమాల ద్వారా పట్టు పరిశ్రమలో కీలక సంస్కరణలను అమలు చేస్తోంది. దీంతో భారతీయ పట్టు పరిశ్రమను మరింత సులభతరం, సమర్థవంతం, భాగస్వాముల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది.

సిల్క్ మార్క్ సేవల డిజిటలీకరణ - వ్యాపార నిర్వహణ సులభతరం: 2004 నుంచి సిల్క్ మార్క్ పథకాన్ని అమలు చేస్తున్న సిల్క్ మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎంఓఐ), సిల్క్ మార్క్ ద్వారా స్వచ్ఛమైన పట్టు ఉత్పత్తుల కచ్చితత్వానికి హామీ ఇస్తోంది. 2022 - 23 నుంచి ఎస్ఎంఓఐ రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ, పత్రాల ప్రాసెసింగ్, ముందస్తు తనిఖీ, చెల్లింపులు, లేబుల్ ఇండెంటింగ్, లేబుళ్ల జారీ, రికార్డుల నిర్వహణ, ఫిర్యాదుల పరిష్కారం వంటి సేవలను దశలవారీగా డిజిటలీకరించింది.

ప్రస్తుతం ఈ డిజిటల్ వ్యవస్థ ద్వారా 7,000 మందికి పైగా అధీకృత వినియోగదారులు సేవలు పొందుతున్నారు. ఏటా 500 మందికి పైగా కొత్తగా నమోదు అవుతున్నారు. నిర్దేశిత నిబంధనలు, అవసరాలను పూర్తి చేసినట్లయితే, దరఖాస్తులను సాధారణంగా 1 - 2 పని దినాల్లో ప్రాసెస్ చేయవచ్చు. ఈ సంస్కరణతో పత్రాల ఆధారిత పనిభారం, కార్యాలయాలకు ప్రత్యక్షంగా వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు పారదర్శకత, ట్రేసబిలిటీ, పరిపాలనా సామర్థ్యం మెరుగుపడ్డాయి. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు, పట్టు రంగానికి చెందిన భాగస్వాములకు ఈ విధానం మరింత ప్రయోజనం చేకూరుస్తోంది.

మేరా రేషమ్ మేరా అభిమాన్ - భారీ పట్టు పరిశ్రమ సాంకేతిక పరిజ్ఞాన బదిలీ ప్రచారం: కేంద్ర సిల్క్ బోర్డు 2025లో మేరా రేషమ్ మేరా అభిమాన్ (ఎంఆర్ఎంఏ) కార్యక్రమాన్ని 100 రోజుల భారీ పట్టు పరిశ్రమ సాంకేతిక పరిజ్ఞాన బదిలీ ప్రచారంగా ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 129 జిల్లాల్లో రైతులతో నేరుగా అనుసంధానం, ప్రదర్శనలు, శిక్షణ, క్షేత్రస్థాయి కార్యక్రమాల ద్వారా ఇప్పటికే నిరూపితమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని 'ప్రయోగశాల నుంచి క్షేత్రస్థాయికి' తీసుకెళ్లింది. ఎంఆర్ఎంఏ 1.0 ద్వారా 1,400 పైగా కార్యక్రమాలు నిర్వహించి, 75,000 మంది రైతులకు ప్రయోజనం చేకూర్చింది.

ఎంఆర్ఎంఏ 1.0 సాధించిన విజయాలు, అందించిన అనుభవాల ఆధారంగా ఎంఆర్ఎంఏ 2.0ను మరింత అభివృద్ధి చెందిన, క్రమబద్ధమైన, ఫలితాలపై దృష్టి సారించే కార్యక్రమంగా రూపొందించారు. దేశంలో ముడి పట్టు ఉత్పత్తిలో 95 శాతానికి పైగా వాటా కలిగిన 218 కీలక పట్టు పరిశ్రమ జిల్లాలను ఇది కవర్ చేస్తోంది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక

# అనాథలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది

### మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా మహిళా సాధికారత అధికారిణి తులసి




ఆదిలాబాద్, అక్టోబర్ 6: అనాథలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని జిల్లా మహిళా సాధికారత అధికారిణి తులసి తెలిపారు. బిచ్కుంద మండలం పుల్కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, మహిళలు, ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, ఓపికతో పిల్లలను పెంచడంతో పాటు పొదుపు అలవర్చుకోవడం ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగువరుచుకోవచ్చని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఏవైనా సమస్యలు ఎదురైతే కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మహిళల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురైన వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ అందిస్తామని చెప్పారు.

పుట్టిన ఆడబిడ్డల భవిష్యత్ కోసం సుకన్య సమృద్ధి యోజన పథకం కింద ప్రతి నెల పోస్టాఫీసులో పొదుపు చేస్తే భవిష్యత్‌లో వారి విద్య, వివాహ ఖర్చులకు ఉపయోగపడుతుందని తులసి వివరించారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు ప్రభుత్వం పోషణ పథకం కింద నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఇళ్లలో చిన్నచిన్న గొడవలు తలెత్తినా సమస్యను తీవ్రం చేసుకోకుండా జిల్లా కేంద్రంలోని సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిధులు ఖర్చు చేస్తోందని, అర్హులైన మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పుల్కల్ వైద్యురాలు డాక్టర్ తసీం అంజుమ్, అంగన్‌వాడీ టీచర్ మంచి గంగామణి, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదాం



ఆదిలాబాద్, అక్టోబర్ 6:మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల అధ్యక్షులు మరియు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ నెల చివరి వారంలో మంచిర్యాలలో భారీ స్థాయిలో 'ముదిరాజ్ సింహగర్జన' సభను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. బీసీ-ఏ వర్గీకరణ: ముదిరాజ్‌లను బీసీ-డీ నుండి బీసీ-ఏలోకి మార్చాలని కోరుతూ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మత్స్య సహకార సంఘాలు: ముదిరాజ్‌లకు ఉపాధి కల్పించేందుకు మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరూ మత్స్యశాఖ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు.

కులాన్ని ఐక్యం చేయడం: ముదిరాజ్ కులస్తుల హక్కులు, సమస్యల సాధన కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని రాష్ట్ర సీనియర్ కార్యదర్శి తండబోయిన శ్రీకాంత్ ముదిరాజ్ కోరారు. మంచిర్యాల జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు గరిగంటి కొమురయ్య ముదిరాజ్, రాష్ట్ర సీనియర్ కార్యదర్శి తండబోయిన శ్రీకాంత్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు మేకల తిరుపతి ముదిరాజ్, మండల అధ్యక్షులు దండవేణి శ్రీధర్, సిద్ధి గంగమల్లు, పోతరవేణి గంగన్న, గౌరవ అధ్యక్షుడు బత్తిని సతీష్ ముదిరాజ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రీ సర్వేకు రైతులు సహకరించాలి



కరీంనగర్, అక్టోబర్ 6: భూభారతి రీ సర్వేకు గ్రామాల్లో రైతులు సర్వే బృందాలకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తి గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు హాజరయ్యారు.

సుమారు 1,700 ఎకరాల భూమి గుర్తించి రీ సర్వే చేయనున్నట్లు చెప్పారు. మొదట గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం, అనంతరం వ్యవసాయ భూముల సర్వే చేపడతామని తెలిపారు. అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ఉపగ్రహ సాంకేతికతతో భూముల హద్దులను గుర్తించి సర్వే చేస్తున్నట్లు వివరించారు. సర్వే బృందాలు రోజుకు సుమారు నాలుగు ఎకరాల చొప్పున సర్వే నిర్వహిస్తాయని, మొత్తం ప్రక్రియ సుమారు నాలుగు నెలల పాటు కొనసాగుతుందని తెలిపారు. భూములకు సంబంధించి రైతులకు ఏవైనా అనుమానాలు, అభ్యంతరాలు లేదా అభిప్రాయాలు ఉంటే సర్వే బృందాలు, రెవెన్యూ అధికారుల దృష్టికి నేరుగా తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం వివరాలను గ్రామపంచాయతీలో ప్రజల సమక్షంలో ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రతి రైతు అధికారులకు సహకరించి రీ సర్వేను విజయవంతం చేయాలని కోరారు. గ్రామసభలో తహసీల్దార్ వనజ, సర్పంచులు కంకణాల లావణ్య, భాస్కర్‌రెడ్డి, పడాల భాగ్యలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ షఫీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, జీపీఓ సదయ్య, సర్వేయర్లు కృష్ణ, వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఇందుర్తి ఉపసర్పంచ్ కంకణాల సాయి చరణ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌కు పీఎంఏవై-జి 2.0 పథకం కింద -3,600 కోట్ల విలువైన 3 లక్షల శాశ్వత గృహాలు మంజూరు

అమరావతి, అక్టోబర్ 5: ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ?3,600 కోట్ల విలువైన 3 లక్షల ఇళ్లలో తొలి విడత గృహాలను కేంద్ర వ్యవసాయ-రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం అప్పగించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ 2.0' (పీఎంఏవై-జి) కింద కేంద్రం ఈ ఇళ్లను మంజూరు చేసింది. ఈ మేరకు గుంటూరు జిల్లా బుర్రిపాలెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు కూడా పాల్గొన్నారు. అనంతరం దేశంలోనే తొలిసారి త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికత ద్వారా ప్రయోగాత్మకంగా ?14 కోట్ల వ్యయంతో నిర్మించే 177 ఇళ్లకు శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలనుద్దేశించిన కేంద్ర మంత్రి ప్రసంగించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు రాష్ట్రంలో ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. అన్ని రంగాలలో పురోగమన వేగం పెంచి, ఆంధ్రపదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖల సహాయ మంత్రి డాక్టర్ శ్రీ చంద్రశేఖర్ పెమ్మసాని, ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్, గృహనిర్మాణ-సమాచార శాఖ మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి, పర్యాటక శాఖ మంత్రి శ్రీ కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు శ్రీ పి.వి.ఎన్.మాధవ్, రాజ్యసభ సభ్యుడు శ్రీ భాష్యం రామకృష్ణ, ఎంపీ శ్రీ లింగమనేని రమేష్, ఎమ్మెల్సీ శ్రీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బత్తుల తాతయ్య బాబు సహా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, వేలాది రైతులు, గ్రామీణులు, మహిళలు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ అవసరాలను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీ చౌహాన్ అన్నారు. కాబట్టే, తమ శాఖ అధికారులు 76,000 ఇళ్లకు ప్రతిపాదనలు పంపినా, ముఖ్యమంత్రి అభ్యర్థన మేరకు ఈ సంఖ్యను 3 లక్షలకు పెంచామని ఆయన వెల్లడించారు. ఈ అంశాన్ని విశదీకరిస్తూ- "ఆంధ్రప్రదేశ్‌కు 76,000 ఇళ్లను కేటాయించేందుకు మాత్రమే వీలుందని మా శాఖ అధికారులు నాకు చెప్పారు. అయితే, రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలని ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు పట్టుబట్టారు. దీంతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశీస్సులతో మేం 3 లక్షల ఇళ్లను మంజూరు చేశాం" అని తెలిపారు. ఇవికాకుండా మరో 6 లక్షల ఇళ్లను కూడా కేటాయించాలనిన ముఖ్యమంత్రి కోరినట్లు చౌహాన్ వెల్లడించారు. కేంద్రం తరఫున నిరంతర మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ మేరకు "కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అండగా ఉన్నదని, నేను కూడా మద్దతిస్తున్నానని శ్రీ చంద్రబా బుకు చెప్పాను. ఇప్పుడు కేటాయించిన 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేశాక మరో 3 లక్షలు, అటుపైన మరో 3 లక్షలు కూడా మంజూరు చేస్తాం. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పేద కుటుంబానికీ పక్కా ఇల్లు లభిస్తుంది'' అని భరోసా ఇచ్చామని చెప్పారు.

బుర్రిపాలెం, ఒబుల నాయుడుపాలెం గ్రామాల్లో ప్రయోగాత్మకంగా చేపడుతున్న త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ గృహనిర్మాణ ప్రాజెక్టును గ్రామీణ గృహనిర్మాణ రంగం ఆధునికీకరణలో కీలక ఘట్టంగా ఆయన అభివర్ణించారు. మొత్తం ?14 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టుతో నిర్మాణ సమయం, ఖర్చులు, శ్రామిక అవసరాలు గణనీయంగా తగ్గుతాయని శ్రీ చౌహాన్ చెప్పారు. అత్యాధునిక యంత్రాలు, త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో 177 ఇళ్ల నిర్మాణం 6 నెలల్లో పూర్తవుతుందని అంచనా. సంప్రదాయ నిర్మాణ పద్ధతులతో పోలిస్తే, వీటి దృఢత్వం ఎక్కువని, దీర్ఘకాలిక మన్నికతో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

రాష్ట్ర రాజకీయ-పురోగమన చరిత్రను ప్రస్తావిస్తూ- 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజధాని రహిత రాష్ట్రంగా మిగిలిందని శ్రీ చౌహాన్ గుర్తుచేశారు. అమరావతిని రాష్ట్ర ఏకైక శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ మోదీ ప్రభుత్వం పార్లమెంటులో చట్టం చేసిందని ఆయన గుర్తుచేశారు అంతేకాకుండా దాని అభివృద్ధి కోసం ?15,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయం కూడా అందించిందని తెలిపారు. రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం సాగునీటి ప్రాజెక్టును కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర జాప్యానికి గురైన ఈ ప్రాజెక్టు నేడు కేంద్రం నుంచి 100 శాతం గ్రాంటుతో వేగంగా సాగుతోందని చెప్పారు. మరోవైపు ప్రతిపాదిత అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం రవాణా అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడమే కాకుండా రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుందన్నారు.

అన్నదాత ఆదాయం పెంపు దిశగా రాష్ట్ర ప్రభుత్వ కృషిని వివరిస్తూ- 'పీఎం-కిసాన్' పథకం కింద కేంద్రం ఇస్తున్న ?6,000కు ఆంధ్రప్రదేశ్ 'అన్నదాత సుఖీభవ' పథకం కింద మరో ?14,000 జోడించడంతో రైతులకు ఏటా ?20,000 మేర ఆర్థిక భరోసా లభిస్తున్నదని శ్రీ చౌహాన్ పేర్కొన్నారు. పండ్లు, పూలు, కూరగాయలు, ఔషధ మొక్కల సాగుపై దృష్టి సారించడం ద్వారా దేశంలోనే అగ్రగామి ఉద్యాన (హార్టికల్చర్) కూడలిగా ఎదిగే సామర్థ్యం తనకున్నదని ఆంధ్రప్రదేశ్ చాటుతున్నట్లు ఆయన చెప్పారు. మహిళల ఆర్థిక సాధికారతను ప్రస్తావిస్తూ- ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే 23 లక్షల మంది మహిళలు స్వయం సహాయ సంఘాల ద్వారా 'లఖ్‌పతి దీదీ'లుగా ఎదిగారని కేంద్ర మంత్రి తెలిపారు. జీవనోపాధి అవకాశాల విస్తరణ, మహిళల ఆర్థిక స్వేచ్ఛ బలోపేతం ద్వారా వీరి సంఖ్యను 60 లక్షలకు పెంచాలని 'ఎన్‌డీఏ' ప్రభుత్వం లక్ష్యనిర్దేశం చేసుకున్నదని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబరు 15న జాతీయ 'సరస్ మేళా' నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. దేశ రాజధాని ఢిల్లీ వెలుపల ఈ కార్యక్రమ నిర్వహణ ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రారంభిస్తారు. మహిళల సామర్థ్యంలోని స్వయం సహాయ సంఘాలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడంతోపాటు మార్కెట్ అవకాశాలను విస్తరించుకునేందుకు ఇదొక వేదికగా నిలుస్తుంది.

'భారత్ మాతా కీ జై', 'శ్రీ వేంకటేశ్వర భగవాన్ కీ జై' నినాదాలతో శ్రీ చౌహాన్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ముందుగా సభికులను తెలుగులో పలకరిస్తూ ఆంధ్రప్రదేశ్ సుసంపన్న వారసత్వం, జ్ఞానం, శాస్త్రవిజ్ఞాన విజయాలు, ప్రతిభను ఆయన కొనియాడారు. తెనాలి రామకృష్ణుడు వంటి కవి పుంగవుడు నడియాడిన ఈ నేలకు నివాళి అర్పిస్తూ- తేనెకన్నా మధురమైన తెలుగు భాషకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తున్నదని చెప్పారు. ఈ సందర్భంగా తెలుగులో మాట్లాడుతూ- "నేను మధ్యప్రదేశ్‌కే కాదు? ఆంధ్ర 'నేనని చమత్కరించారు. "ప్రజా సేవ నాకు దైవారాధనతో సమానం. ఇక్కడి ప్రజల ఉత్సాహం, నిజాయితీ, అంకితభావం చూశాక మిమ్మల్ని మళ్లీమళ్లీ కలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అన్నారు. దీంతో ప్రజలంతా ఆనందోత్సాహాలతో పెద్దపెట్టున స్పందిస్తూ కరతాళ ధ్వనులు చేశారు.

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ శ్రీ చంద్రశేఖర్ పెమ్మసాని తన పూర్వికుల గ్రామం బుర్రిపాలెంను సందర్శించడం తనకు అపరిమిత ఆనందం కలిగించిందని శ్రీ చౌహాన్ అన్నారు. ప్రజాసేవపై శ్రీ పెమ్మసాని నిబద్ధతను, క్షేత్రస్థాయిలో ప్రజలతో ఆయనకుగల అనుబంధాన్ని ప్రశంసించారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన వ్యక్తికి గ్రామీణ జీవితం, అభివృద్ధి ఏ మాత్రం అర్థమవుతాయన్న సందేహం తనలో ఉండేదన్నారు. "అయితే, ప్రజలతో ఆయనకున్న సన్నిహిత బంధం, సేవా స్ఫూర్తి, లక్ష్యసాధనలో స్పష్టత వంటి సుగుణాలు నన్నెంతో ప్రభావితం చేశాయి. ప్రతిభను గుర్తించడమే కాకుండా వారిని ప్రజా జీవనంలోకి తేవడంలో శ్రీ చంద్రబాబు సామర్థ్యం అపారం.. అద్భుతం" అని ఆయన వ్యాఖ్యానించారే. ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబును చురుకైన, అంకితభావం గల, నిర్ణయాత్మక నేతగా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన ఐటీ కూడలిగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదేనని శ్రీ చౌహాన్ కొనియాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ, డేటా సెంటర్లు, అత్యాధునిక తయారీ రంగాలకు అమరావతిని కూడలిగా రూపుదిద్దడంలో శ్రీ నాయుడు దార్శనికతే సారథ్యశక్తిగా ఉందన్నారు.

రాష్ట్రంలో పేదలకు గృహనిర్మాణంపై కేంద్రం మద్దతుకు ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను మధ్యప్రదేశ్ ప్రజలకే కాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజలకూ ఆత్మీయుడైన 'మామ'గా అభివర్ణించారు. "శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్‌లో సుపరిపాలన, ప్రజాసేవ ద్వారా అద్భుత రికార్డు సృష్టించిన ప్రజా నాయకుడు. ఆంధ్రప్రదేశ్‌లోని పేదలకు పక్కా ఇళ్ల అంశాన్ని మేం ప్రస్తావించగానే- కేటాయింపును 75,000 నుంచి ఏకంగా 3 లక్షలకు పెంచి ప్రజల హృదయాలను గెలుచుకున్నారు" అని ప్రశంసించారు. ప్రతి పేద కుటుంబానికీ పక్కా గృహవసతి కల్పన దిశగా ఎన్‌డీఏ ప్రభుత్వం నిబద్ధతతో ఉందన్నారు. ఇందుకోసం రాష్ట్రానికి 9 లక్షల గృహాలు అవసరమని ఆయన గుర్తుచేశారు. దీనిపై శ్రీ చౌహాన్ హామీ ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ- తొలి దశ పూర్తికాగానే మిగిలిన 6 లక్షల గృహాలకూ కేంద్రం ఆమోద ముద్ర వేస్తుందని విశ్వసిస్తున్నట్లు శ్రీ నాయుడు చెప్పారు. రాష్ట్ర ప్రగతి వేగంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ- ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గనిర్దేశంలో, శ్రీ చౌహాన్ నిరంతర మద్దతుతో మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, అత్యాధునిక సాంకేతికతలు, గ్రామీణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలవగలదని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు.

# మైనారిటీ మహిళలకు ప్రోత్సాహం

## జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



కరీంనగర్, అక్టోబర్ 6: మైనారిటీ మహిళలకు స్వయం ఉపాధికి ప్రోత్సాహకాలు అందిస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని మోతే, ధరూర్ గ్రామాలకు చెందిన మైనారిటీ మహిళలకు ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం 2025-26 కింద మంజూరైన చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

మోతే గ్రామానికి చెందిన షేక్ బీబీకి కిరాణా షాపు ఏర్పాటుకు, దరూర్ గ్రామానికి చెందిన షబానాకు టైలరింగ్ బోటిక్ ఏర్పాటుకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనారిటీ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సంపన్న దేశాల్లో కూడా ప్రభుత్వం అందరికీ ఉద్యోగాలు ఇవ్వలేదని, స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలని, ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. మహిళా సాధికారత, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్ సెటీ ద్వారా మహిళలకు శిక్షణ ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాసవి, పిఏసిఎస్ చైర్మన్ దామోదర్ రావు, సర్పంచ్ మహేష్, నాయకులు ములసపు మహేష్, మతులాపురం శేఖర్, సంజీవ్, రఘు, సంబంధిత అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

# వేధింపులను భరించకండి.. ఎదురించండి

## ఫిర్యాదు చేస్తే షీ టీమ్ రక్షణ.. రెండు నెలల్లో ఆకతాయిలపై 4 ఎఫ్‌ఐఆర్‌లు, 5 పెట్టీ కేసులు : ఎస్పీ మహేష్ బి. గితే

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 6:(నేటినిజం ప్రతినిధి): మహిళలు, బాలికలు, విద్యార్థినులు ఎలాంటి వేధింపులకు గురైనా మౌనంగా భరించకుండా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. వేధింపులపై సమాచారం అందిస్తే ఆకతాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు, బాలికల భద్రత కోసం జిల్లా షీ టీమ్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని చెప్పారు. గడిచిన రెండు నెలల్లో షీ టీమ్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా ఆకతాయిలపై 4 ఎఫ్‌ఐఆర్‌లు, 5 పెట్టీ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. వేధింపులు ఎదురైనప్పుడు వెంటనే ఫోన్ ద్వారా షీ టీమ్‌కు సమాచారం అందిస్తే రక్షణ కల్పించడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



### అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

మహిళలు, విద్యార్థినులు అపరిచిత వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని, సామాజిక మాధ్యమాల్లో పరిచయమయ్యే వ్యక్తుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రాంతాలు, రద్దీ ప్రదేశాల్లో షీ టీమ్ బృందాలు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, సామాజిక మాధ్యమాల మోసాలు, మహిళల రక్షణ చట్టాలపై విద్యార్థులు, మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

### హాట్‌స్పాట్ల వద్ద మఫ్టీలో నిఘా

జిల్లాలో గుర్తించిన వేధింపుల ప్రభావిత ప్రాంతాల్లో షీ టీమ్ బృందాలు మఫ్టీలో నిత్యం నిఘా కొనసాగిస్తున్నాయని ఎస్పీ తెలిపారు. మహిళలు, విద్యార్థినులను వేధించే ఆకతాయిలను గుర్తించి అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యాసంస్థల్లో, రహదారులపై, పని ప్రదేశాల్లో ఎవరైనా అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే షీ టీమ్ నంబర్ 8712656425కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులపై స్పందించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలి

## అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో చోటు..

## ఫారం-6, 7, 8 దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి : అబ్జర్వర్ బాల మాయాదేవి



కరీంనగర్, అక్టోబర్ 6:స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాల మాయాదేవి అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అనర్హుల పేర్ల తొలగింపులో చట్టబద్ధమైన విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలతో ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్‌పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, హెల్ప్‌డెస్క్‌ల వద్దకు వచ్చే ఓటర్లకు దరఖాస్తుల విధానం, అవసరమైన పత్రాలు, నోటీసుల వివరాలను స్పష్టంగా తెలియజేసి సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా పోస్టర్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయని అభినందించిన బాల మాయాదేవి, మిగిలిన 30 శాతం పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో చివరి నిమిషంలో పనులపై ఒత్తిడి పెరగకుండా ముందస్తు ప్రణాళికతో పెండింగ్ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి అంశానికి సంబంధించిన డాక్యుమెంటేషన్ పక్కాగా ఉండేలా చూడాలని, గణాంకాలు, వివరాలు పరస్పరం సరిపోలేలా రీకన్సిలియేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ల పేర్ల తొలగింపు అత్యంత సున్నితమైన అంశమని, ప్రతి డిలీషన్‌ను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సంబంధిత వ్యక్తులకు చట్టబద్ధమైన నోటీసులు అందించి, అవసరమైన సందర్భాల్లో విచారణకు తగిన సమయం కల్పించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొత్తగా అర్హత పొందిన ఓటర్లను జాబితాలో చేర్చేందుకు ఫారం-6 ద్వారా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించి పరిష్కరించాలని, ఒకే ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో డిలీషన్లు లేదా ఇంక్లూజన్లకు దరఖాస్తులు వస్తే ప్రత్యేకంగా పరిశీలించాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్‌లో భాగంగా జారీ చేసిన నోటీసులు సంబంధిత వ్యక్తులకు సక్రమంగా అందేలా ఏఈఆర్‌వోలు ప్రత్యేక దృష్టి సారించాలని అబ్జర్వర్ సూచించారు. నోటీసుల పంపిణీ, దరఖాస్తుల పరిశీలన, పెండింగ్ పనుల పురోగతిపై ప్రతిరోజూ సమీక్ష నిర్వహించాలని, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. బీఎల్‌ఓలతో పాటు బూత్ లెవల్ ఏజెంట్ల భాగస్వామ్యంతో ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఎస్ఐఆర్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి నోటీసుల పరిశీలన, సంబంధిత పత్రాల స్వీకరణ, దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లను అవసరం లేకుండా కార్యాలయాలకు పిలిపించకుండా సాధ్యమైనంత వరకు వారి ఇళ్ల వద్దే వివరాలను పరిశీలించి పత్రాలు స్వీకరించాలని సూచించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమావేశాలు నిర్వహించి ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం, పెండెన్సీపై తాజా పురోగతిని పారదర్శకంగా తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. మూడు రకాల దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిశీలించి పరిష్కరించాలని, ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నోటీసులు జారీ చేసిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన పత్రాలను సేకరించి నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పండుగల సెలవులను దృష్టిలో ఉంచుకుని మిగిలిన పనులను ముందుగానే ప్రణాళిక చేసుకుని వేగవంతం చేయాలని, చివరి నిమిషంలో హడావుడి లేకుండా నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్‌రెడ్డి, నరసింహారావు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెత్త ఏరుకోవడం నుంచి పారిశ్రామికవేత్త దాకా...

## గౌరవం, స్వయం-సమృద్ధి దిశగా సాగిన ఓ ప్రయాణం

న్యూఢిల్లీ, అక్టోబర్ 6:ఆర్థిక సహాయం, స్థిరమైన జీవనోపాధి అవకాశాలను పొందడం... వెనకబడిన వర్గాలకు చెందిన వ్యక్తులను శక్తిమంతం చేయడానికి, వారి సామాజిక-ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి ముఖ్యంగా దోహదపడతాయి. స్వయం ఉపాధి, యాంత్రీకరణకు మద్దతు నివ్వడం... అణగారిన వర్గాలకు చెందిన కార్మికులు మరింత స్థిరమైన ఆదాయ వనరుల వైపు వెళ్లడానికి, కుటుంబ ఆర్థిక భద్రతను బలోపేతం చేయడానికి, పని పట్ల గౌరవాన్ని పెంపొందించడానికి సహాయపడుతాయి.

30 ఏళ్ల మేకల నాంచారమ్మ షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) వర్గానికి చెందినవారు. ఆమె దాదాపు 12 ఏళ్లుగా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త ఏరుకునే కార్మికురాలిగా పనిచేస్తున్నారు. ఆర్థికంగా వెనకబడిన కుటుంబం నుంచి వచ్చిన ఆమె... చిన్న వయసులోనే చెత్త ఏరుకునే పనిని చేపట్టవలసి వచ్చింది. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆమె పాఠశాలకు వెళ్ల లేకపోయారు. నిరక్షరాస్యులుగానే మిగిలిపోయారు. ఆమె జీవనోపాధి చాలా వరకు చెత్త ఏరుకోవడంపైనే ఆధారపడి ఉండేది. దీనివల్ల వచ్చే ఆదాయం పరిమితంగా, క్రమరహితంగా ఉండటంతో... ఇంటి ఖర్చులు తీర్చడం, తన పిల్లలకు మంచి భవిష్యత్తును కల్పించడం ఆమెకు కష్టంగా మారింది.

కనీస వసతులు, నిత్యావసర సేవలు పరిమితంగా ఉన్న మురికివాడ వాతావరణంలో నివసించడం ఆమె కుటుంబ సామాజిక-ఆర్థిక అవకాశాలను మరింతగా దెబ్బతీసింది. తన బలహీనమైన సామాజిక, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆమె సామాజిక బహిష్కరణను, వివక్షనూ ఎదుర్కొన్నారు. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ... శ్రీమతి నాంచారమ్మ తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవడానికి, తన పిల్లలకు మంచి విద్యావకాశాలు కల్పించడానికి, మరింత సురక్షితమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి దృఢ సంకల్పంతో ఉన్నారు.నవజీవన్ సంస్థ ద్వారా 'స్వచ్ఛతా ఉద్యమీ యోజన' (ఎస్‌యూవై) కింద శ్రీమతి నాంచారమ్మకు అందిన సహాయం ఆమె జీవితంలో ఒక కీలక మలుపుగా నిలిచింది. ఇద్దరు సభ్యులతో కూడిన ఒక సమూహ ప్రాజెక్టు కింద... 'ఓపెన్ నాలా క్లీనర్' (ట్రాక్టర్ అమర్చిన పరికరం) కొనుగోలుకు ఆర్థిక సహాయం లభించింది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 16,99, 952 కాగా... ఇందులో రూ. 10,24,964 రుణం, రూ. 6,74,988 మూలధన రాయితీ ఉన్నాయి.

ఈ ఆర్థిక సహాయంతో శ్రీమతి నాంచారమ్మ సాంప్రదాయిక పద్ధతిలో వ్యర్థాలను ఏరుకునే పని నుంచి బయటపడి... వ్యవస్థీకృతమైన, సుస్థిరమైన జీవనోపాధిని పొందగలిగారు. యాంత్రిక పరికరాల సహాయంతో ఆమె నెలకు అదనంగా రూ.10,000 సంపాదించడం ప్రారంభించారు. ఈ సహాయం అందకముందు సుమారు రూ.8,000గా ఉన్న ఆమె నెలవారీ ఆదాయం, ఇప్పుడు సుమారు రూ.18,000కు పెరిగింది.ఆదాయం పెరగడం వల్ల ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితుల్లో గణనీయమైన మెరుగుదల వచ్చింది. ఇప్పుడు ఆమె ఇంటి ఖర్చులను భరించడం, పిల్లల చదువులకు అండగా నిలవడం, కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవడం వంటి విషయాల్లో మెరుగైన స్థితిలో ఉంది. ఈ జీవనోపాధి అవకాశం ఆమె ఆర్థిక భద్రతను, ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవ భావననూ బలోపేతం చేసింది.

తనకు లభించిన మద్దతు గురించి శ్రీమతి నాంచారమ్మ ఇలా అన్నారు. " 'స్వచ్ఛతా ఉద్యమీ యోజన' కింద అందిన మద్దతు... సంప్రదాయ పద్ధతిలో వ్యర్థాలను ఏరుకునే పనికి పరిమితం కాకుండా, మరింత స్థిరమైన ఆదాయాన్ని పొందడంలో నాకు సహాయపడింది. ఇది నా కుటుంబ ఆర్థిక భద్రతను బలోపేతం చేయడంతో పాటు, నాకు మరింత ఆత్మవిశ్వాసాన్ని, గౌరవాన్నీ కల్పించింది."

ఈ ఆర్థిక సహాయం, యంత్ర పరికరాల లభ్యత, సుస్థిర జీవనోపాధి అవకాశాలు బలహీన వర్గాలను ఆర్థిక స్వాతంత్ర్యం, స్వయం సమృద్ధి దిశగా ఎలా ముందుకు నడిపించగలవో శ్రీమతి నాంచరమ్మ ప్రస్థానం నిరూపిస్తుంది. క్రమరహిత ఆదాయం పొందే చెత్త ఏరుకునే పనిపై ఆధారపడటం నుంచి మరింత వ్యవస్థీకృత జీవనోపాధిలో పాలుపంచుకునే స్థాయికి ఆమె పరివర్తన... గౌరవప్రదమైన, సురక్షితమైన భవిష్యత్తుకు అవకాశాలను కల్పించడంలో సాధికారత ఆధారిత కార్యక్రమాల సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది.

# ఏజెన్సీకి కొత్త జీవో తేవాలి

## -పీఆర్సీ ఫిట్‌మెంట్ 51 శాతం ప్రకటించాలి



నల్గొండ, అక్టోబర్ 6:టీజీటీజీటీఎఫ్ గూడూరు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంగోత్ ధర్మా నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

మండల గౌరవ అధ్యక్షులుగా హంసావత్ శ్రీనివాస్, అధ్యక్షులుగా డాక్టర్ వాంకుడోత్ గోపినాథ్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ రవి, మహిళా ఉపాధ్యక్షురాలిగా బోడ ఝాన్సీరాణి, ప్రధాన కార్యదర్శిగా బానోత్ విజయ, కోశాధికారిగా బానోత్ రాజ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజ్మీర రూప్లను ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బానోత్ మంగీలాల్, ఉపాధ్యక్షులుగా బానోత్ వీరన్న, బోడా మంగీలాల్, కార్యదర్శిగా ఇస్లావత్ చందా నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా భూక్యా బాలు నాయక్, సీఆర్‌టీ విభాగం అధ్యక్షులుగా తేజావత్ పూల్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఏజెన్సీలో జీవో నంబర్ 3 స్థానంలో కొత్త జీవో తీసుకురావాలని, పీఆర్సీ ఫిట్‌మెంట్ 51 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ అలవెన్స్, హెచ్‌ఆర్‌ఏ, ఎస్‌సీఏ పెంపుతో పాటు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. సీఆర్‌టీలతో పాటు ఎంఐఎస్, సీసీఓ, సీఆర్‌పీ, కేజీబీవీ సీఆర్‌టీలను రెగ్యులరైజ్ చేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, పార్ట్‌టైం ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ అజ్మీరా వీరునాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉత్పత్తికి మరో ముందడుగు

నల్గొండ, అక్టోబర్ 6: భూపాలపల్లి సర్కిల్ పరిధిలోని చిట్యాల మండలం కైలాపూర్‌లో, పీఎం–కుసుమ్ 'ఎ' పథకం కింద టీ. రఘునాథరావుకు చెందిన 2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను 33/11 కేవీ చిట్యాల సబ్‌స్టేషన్‌కు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సదానందం సోమవారం విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ.. సౌర విద్యుత్ ఉత్పత్తి ద్వారా స్థానికంగా విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంపొందించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. పీఎం కుసుమ్ 'ఎ' పథకం ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచుతూ, పర్యావరణహితమైన మరియు స్థిరమైన విద్యుత్ ఉత్పత్తికి టీజీఎన్‌పీడీసీఎల్ ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భూపాలపల్లి డీఈ జగదీష్, ఏడీఈ సుందర్ కుమార్, చిట్యాల ఏఈ చంద్రశేఖర్, మరియు టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి దిబ్రూగఢ్ బోగీబీల్ నుంచి బంగ్లాదేశ్‌కు అంతర్జాతీయ సరకు రవాణా ప్రారంభం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 6: అస్సాంలోని దిబ్రూగఢ్ బోగీబీల్ టెర్మినల్ నుంచి 540 మెట్రిక్ టన్నుల మిథనాల్‌తో ఒక బార్జ్ నేడు బంగ్లాదేశ్‌లోని ధాకాకు బయలుదేరింది. కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాలశాఖ మంత్రి (పీఎస్‌డబ్ల్యూపీ) శ్రీ సర్బానంద సోనోవాల్ బోగీబీల్ నుంచి టగ్ కుశాల్ కోన్వార్‌తో నడిచే డీఎల్‌బీ పట్కాయ్ నౌకను జెండా ఊపి ప్రారంభించారు. అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మ ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఎగువ అస్సాం ప్రాంతం నుంచి విదేశీ ఓడరేవుకు సరకు రవాణా జరగడం ఇదే తొలిసారి. దాదాపు 70 ఏళ్ల క్రితం బోగీబీల్‌లోని నదీ ఘాట్ మూతపడిన తర్వాత మళ్లీ ఇక్కడి నుంచి ఇప్పుడే అంతర్జాతీయ సరకు రవాణా ప్రారంభమైంది.

నమ్రూప్‌లోని ప్రభుత్వ రంగ సంస్థ అస్సాం పెట్రో–కెమికల్స్ లిమిటెడ్ (ఏపీసీఎల్) ఉత్పత్తి చేసిన ఈ మిథనాల్‌ను బంగ్లాదేశ్‌లోని ధాకా పంగావ్ ఓడరేవుకు తరలిస్తున్నారు. ఈ నౌక భారత్‌లోని బ్రహ్మపుత్ర నదిపై ఉన్న జాతీయ జలమార్గం–2 (ఎన్‌డబ్ల్యూ–2)లో సుమారు 768 కిలోమీటర్లు ప్రయాణించి భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుకు చేరుకుంటుంది. అక్కడి నుంచి భారత్–బంగ్లాదేశ్ ప్రోటోకాల్ మార్గం (ఐబీపీఆర్) ద్వారా ముందుకు సాగుతుంది. దిబ్రూగఢ్‌లోని బోగీబీల్ నుంచి బంగ్లాదేశ్‌లోని ధాకా సమీపంలోని నారాయణ్‌గంజ్ వరకు నౌక మొత్తం సుమారు 1,300 కిలోమీటర్లు ప్రయాణించనుంది.

ఈ ప్రయాణాన్ని ఈశాన్య భారత్‌ను విదేశీ మార్కెట్లతో అనుసంధానించే వాణిజ్యపరంగా ప్రయోజనకరమైన సరకు రవాణా మార్గంగా బ్రహ్మపుత్ర నది ఎంతవరకు ఉపయోగ పడుతుందో పరీక్షించే మార్గంగా పరిగణిస్తున్నారు. భవిష్యత్తులో బంగ్లాదేశ్‌కు క్రమం తప్పకుండా మిథనాల్ సరఫరా చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఇటీవల బోగీబీల్, ధుబ్రీ ప్రాంతాల్లో కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ సదుపాయాలతో కూడిన సముదాయాలను ఏర్పాటు చేయడంతో ఈ అంతర్జాతీయ సరకు రవాణా సాధ్యమైంది.

"మా తాతలు, అమ్మమ్మలు దిబ్రూగఢ్ రేవులో స్టీమర్ సైరన్ శబ్దాన్ని వింటూ పెరిగారు. 70 ఏళ్లుగా ఆ శబ్దం వినిపించలేదు, నౌకల రాక కూడా ఆగిపోయింది. ఈరోజు దిబ్రూగఢ్ నుంచి మళ్లీ ఒక నౌక ప్రపంచం వైపు బయలుదేరింది. ఈ నది ఎప్పుడూ మనల్ని నిరాశపరచలేదు. దశాబ్దాలుగా దాన్ని పునరుద్ధరించాలనే సంకల్పం లేకపోవడమే సమస్య" అని కేంద్రమంత్రి శ్రీ సోనోవాల్ అన్నారు.

అస్సాంకు ఇది గర్వించదగిన రోజని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అన్నారు. "నామ్రూప్‌లో తయారైన అస్సాంకు చెందిన ఉత్పత్తి.. ఇప్పుడు రాష్ట్ర సొంత నదిపై ప్రయాణిస్తూ అంతర్జాతీయ మార్కెట్‌కు చేరుతోంది. ఈశాన్య ప్రాంతం ఇకపై దేశానికి అంచున ఉన్న ప్రాంతం కాదు. ఇది తూర్పు దేశాలకు భారత్‌కు ఉన్న ప్రవేశ ద్వారం" అని ఆయన పేర్కొన్నారు.

ఈ సరకు రవాణా ఒక ప్రారంభం మాత్రమేనని సోనోవాల్ అన్నారు. "ఇది తొలి ప్రయాణం.. చివరిది కాదు. అస్సాం యువతకు నేను చెప్పేది ఒక్కటే, ఈ నదిని చూస్తూ పెద్ద కలలు కనండి. ప్రపంచం ఇక దూరంగా లేదు. నది దిగువకు ప్రయాణిస్తే ప్రపంచాన్ని చేరుకోవచ్చు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశ తేయాకు రాజధానిగా పేరు గాంచిన దిబ్రూగఢ్.. ఒకప్పుడు గొప్ప నదీ రేవుగా ఉన్న తన పూర్వ వైభవాన్ని మళ్లీ సొంతం చేసుకుంటోంది. చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో దిబ్రూగఢ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 1956లో ఆగిపోయిన స్టీమర్ సైరన్ శబ్దం మళ్లీ వినిపిస్తోంది" అని సోనోవాల్ అన్నారు.

ఒకప్పుడు తూర్పు భారత్‌లోని అత్యంత రద్దీగా ఉండే నదీ రేవుల్లో దిబ్రూగఢ్ ఒకటిగా ఉండేది. 1856 నాటికే అప్పటి కలకత్తా, ప్రస్తుతం కోల్‌కతా నుంచి ప్రభుత్వ స్టీమర్లు దిబ్రూగఢ్‌కు చేరుకునేవి. 1882లో దిబ్రూగఢ్ స్టీమర్ రేవు నుంచి దిబ్రూ?సాదియా రైల్వే సేవలు ప్రారంభమయ్యాయి. 1913 నాటికి ప్రతిరోజూ స్టీమర్లు బ్రహ్మపుత్ర నదిపై ప్రయాణిస్తూ దిబ్రూగఢ్‌కు చేరుకునేవి. అవి తేయాకు, కలపతో పాటు ప్రయాణికులను కూడా రవాణా చేసేవి.

1947లో దేశ విభజనతో ఈ జలమార్గం తెగిపోయింది. దీంతో అస్సాం నుంచి సరుకులను కోల్‌కతాకు తరలించాలంటే తూర్పు పాకిస్థాన్ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1950లో సంభవించిన భూకంపం కారణంగా దిబ్రూగఢ్ వద్ద నది అడుగుభాగంలో మార్పులు చోటుచేసుకున్నాయి. 1954లో దిబ్రూగఢ్ రేవు నుంచి సాధారణ సరకు బుకింగ్‌లు నిలిచిపోయాయి. తేయాకు సరఫరా రైలు మార్గానికి మారడంతో 1956 అక్టోబర్ 15న ఈ రేవు పూర్తిగా మూతపడింది. 1965లో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన యుద్ధం కారణంగా సరిహద్దుల మధ్య నదీ మార్గం ద్వారా సరకు రవాణా నిలిచిపోయింది. 1972లో భారత్, బంగ్లాదేశ్ నదీ వాణిజ్యానికి సంబంధించిన ప్రోటోకాల్‌పై సంతకాలు చేశాయి. 1988లో సాదియా నుంచి ధుబ్రీ వరకు బ్రహ్మపుత్ర నదిలోని 891 కిలోమీటర్ల మార్గాన్ని జాతీయ జలమార్గం–2 (ఎన్‌డబ్ల్యూ–2)గా ప్రకటించారు. అయితే ఈ జలమార్గంలో సాధారణ సరకు రవాణా సేవలు ప్రారంభం కావడానికి 2017 డిసెంబర్ వరకు సమయం పట్టింది. ఆ సమయంలో పాండు నుంచి ధుబ్రీకి సిమెంట్‌ను రవాణా చేయడం ద్వారా ఈ సేవలు ప్రారంభమయ్యాయి

"దశాబ్దాలుగా దిబ్రూగఢ్ పూర్వ వైభవం క్రమంగా కనుమరుగైంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దిబ్రూగఢ్‌కు దక్కాల్సిన ప్రాధాన్యాన్ని తిరిగి తీసుకురావడానికి మేం చర్యలు ప్రారంభించాం. బోగీబీల్ టెర్మినల్, కస్టమ్స్, వలసల తనిఖీ సదుపాయాలతో కూడిన సముదాయం, 'జలవాహక్' కింద నిర్ణీత షెడ్యూల్‌తో నడిచే సరకు రవాణా సేవలు ఈ చారిత్రక పట్టణానికి ఆధునిక సదుపాయాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులను అందిస్తున్నాయి. దిబ్రూగఢ్‌కు గొప్ప పేరు తెచ్చిన వారసత్వాన్ని పునరుద్ధరిస్తూనే భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం. ఈరోజు దిబ్రూగఢ్ నుంచి మరోసారి విదేశీ ఓడరేవుకు సరకు బయలుదేరుతున్న వేళ.. పట్టణం గతంలోని గర్వకారణమైన చరిత్ర, భవిష్యత్తులోని అవకాశాలు ఒకే నదిపై కలుస్తున్నాయి" అని కేంద్ర మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ అన్నారు.

ఆ తర్వాత ఈ జలమార్గంలో కార్యకలాపాలు మరింత పెరిగాయి. 2022 ఫిబ్రవరిలో టాటా స్టీల్‌కు చెందిన బార్జ్‌లు బంగ్లాదేశ్ మీదుగా పాండుకు చేరుకున్నాయి. 2023లో వారణాసి నుంచి బంగ్లాదేశ్ మీదుగా నదీ విహార నౌక ఎంవీ గంగా విలాస్ దిబ్రూగఢ్‌కు చేరుకుంది. బోగీబీల్ ప్రయాణికుల, సరకు రవాణా టెర్మినల్‌కు 2023 జూలైలో శంకుస్థాపన చేయగా.. 2024 ఫిబ్రవరిలో ఇది ప్రారంభమైంది. 2024 డిసెంబర్‌లో 'జల్‌వాహక్' సరకు రవాణా ప్రోత్సాహక కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల మంత్రిత్వ శాఖ ప్రకారం, భారత్‌లోని జాతీయ జలమార్గాల ద్వారా సరకు రవాణా 2013–14 ఆర్థిక సంవత్సరంలో 18 మిలియన్ మెట్రిక్ టన్నుల నుంచి 2025–26లో 218 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఈశాన్య ప్రాంతంలోని జలమార్గాల అభివృద్ధి కోసం రూ. 6,800 కోట్లకు (68 బిలియన్లు) పైగా పెట్టుబడులు పెడుతున్నారు. ఇందులో జాతీయ జలమార్గం–2 అభివృద్ధి, పాండు వద్ద నౌకల మరమ్మతు కేంద్రం ఏర్పాటు, పాండు ఓడరేవుకు చివరి దశ రవాణా అనుసంధానం వంటి పనులు ఉన్నాయి.

"నదుల ద్వారా మనం తరలించే ప్రతి టన్ను సరకు అంటే తక్కువ ఇంధనం వినియోగించడం, జాతీయ రహదారులపై తక్కువ సంఖ్యలో ట్రక్కులు నడవడం" అని సోనోవాల్ అన్నారు. ప్రాంతీయ జలమార్గ అనుసంధానాలను అభివృద్ధి చేసేందుకు భారత్ బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్‌లతో కలిసి పనిచేస్తోందని ఆయన తెలిపారు.

ఈ సరకు రవాణా కార్యక్రమంలో ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా, అస్సాం పెట్రో–కెమికల్స్, కొచ్చిన్ బంకర్స్ ప్రైవేటు లిమిటెడ్‌తో పాటు బంగ్లాదేశ్‌లోని భాగస్వామ్య సంస్థలు పాల్గొన్నాయి.

ఈ కార్యక్రమానికి అస్సాం రాష్ట్ర మంత్రులు చరణ్ బోరో, బిమల్ బోరా, సుశాంత బోర్గోహైన్‌తోపాటు రాజ్యసభ సభ్యుడు తెరాష్ గోవాల్లా కూడా పాల్గొన్నారు. ఈ ప్రాంతానికి చెందిన పలువురు రాష్ట్ర శాసనసభ్యులు సైతం కార్యక్రమానికి హాజరయ్యారు. వారిలో దిబ్రూగఢ్ ఎలఏసీ ఎమ్మెల్యే ప్రశాంత ఫుకాన్, ఖోవాంగ్ ఎల్‌ఏసీ ఎమ్మెల్యే చక్రధర్ గోగోయ్ ఉన్నారు. ఐడబ్ల్యూఏఐ చీఫ్ ఇంజనీర్ ఏకే బన్సల్, అస్సాం పెట్రో–కెమికల్స్ (ఏపీసీఎల్) చైర్మన్ బికుల్ చంద్ర డేకాతో పాటు ఏపీసీఎల్, ఐడబ్ల్యూఏఐ, అస్సాంప్రభుత్వానికి చెందిన అధికారులు ఈ చారిత్రక కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చింతన్ శిబిర్-2026ను ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ: భవిష్యత్తు అవసరాలకు తగిన జాతీయ రహదారి మౌలిక వసతుల కోసం అజెండా నిర్దేశం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 6:"చింతన్ శిబిర్?2026 – జాతీయ రహదారి మౌలిక వసతులపై జాతీయ సదస్సు"ను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ఈ రోజు ప్రారంభించారు. గుజరాత్‌లోని నర్మదా జిల్లా, ఏక్తానగర్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ, టెంట్ సిటీ 2 వద్ద ఈ కార్యక్రమం జరిగింది. భారతదేశంలో జాతీయ రహదారి మౌలికవసతులను బలోపేతం చేయడంపై రెండు రోజుల పాటు జరిగే కేంద్రీకృత చర్చలకు ఇది దిశానిర్దేశం చేసింది. 'గతిశక్తి సే ప్రగతి' అనే నినాదంతో ఈ చింతన్ శిబిర్ నిర్వహిస్తున్నారు. దీనిలో రాష్ట్రాల రవాణా, పీడబ్ల్యూడీ శాఖల మంత్రులు, రాష్ట్రాల పీడబ్ల్యూడీల ఉన్నతాధికారులు, అమలు సంస్థలు, ఇతర భాగస్వాములు... రహదారుల అభివృద్ధి, ప్రాజెక్టుల అమలు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన కీలక అంశాలపై చర్చిస్తారు. రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రి శ్రీ హర్ష్ మల్హోత్రా కూడా ప్రారంభ కార్యక్రమంలో ఉపన్యసించారు.

జాతీయ రహదారుల అభివృద్ధిలో ఎదురవుతున్న నూతన సవాళ్లపై సమాలోచనలు జరపడానికి, క్షేత్రస్థాయి అనుభవాలను పంచుకోవడానికి, ఆచరణాత్మక పరిష్కారాల దిశగా కలిసి పనిచేయడానికి అవసరమైన వేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ చింతన్ శిబిర్ అందిస్తుందని ప్రారంభ కార్యక్రమంలో శ్రీ గడ్కరీ తెలియజేశారు. దేశవ్యాప్తంగా ప్రాజెక్టు అమలును, మౌలికవసతులను అందించే ఫలితాలను మెరుగుపరచడానికి వివిధ రాష్ట్రాలు అమలు చేస్తున్న విజయవంతమైన పద్ధతుల గురించి పంచుకోవాలని, వాటిని పరిశీలించాలని, అవసరమైన చోట వాటిని ఉపయోగించాలని స్పష్టం చేశారు.

నాణ్యత, భద్రత, వేగం, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలపై దృష్టి సారించి జాతీయ రహదారులను అభివృద్ధి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) దశలోనే ముందస్తు ప్రణాళిక, సన్నద్ధతకు ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు. వీటిలో తగిన సర్వేలు, అలైన్‌మెంట్ ప్రణాళిక, భూ సేకరణ, యుటిలిటీ తరలింపు, సకాలంలో చట్టబద్ధమైన అనుమతులను భాగం చేయాలన్నారు. జాప్యాలను తగ్గించడానికి, ఖర్చులను నియంత్రించడానికి, రహదారి ప్రాజెక్టుల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ప్రారంభ సన్నద్ధత దోహదపడుతుందని ఆయన అన్నారు.

ఆరంభం నుంచే జాతీయ రహదారుల ప్రణాళిక, ప్రాజెక్టు డిజైన్‌లోనే రోడ్డు భద్రతను భాగం చేయాలని శ్రీ గడ్కరీ చెప్పారు. ప్రణాళిక, నిర్మాణ దశల్లోనే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించడం, తగిన భద్రతా చర్యలను చేపట్టడం ద్వారా సురక్షితమైన రహదారులను ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు.

జాతీయ ఆర్థిక వృద్ధిలో జాతీయ రహదారులకు ఉన్న ప్రాధాన్యాన్ని మంత్రి వివరించారు. నగరాలు, పట్టణాలు, ఓడరేవులు, మార్కెట్లు, పారిశ్రామిక కేంద్రాల మధ్య ఎలాంటి ఆటంకాలు లేని అనుసంధానాన్ని జాతీయ రహదారులు అందించాలని చెప్పారు. వాణిజ్యానికీ, పెట్టుబడులకూ, ఉపాధికీ, సమగ్రార్థికాభివృద్ధికీ మెరుగైన రవాణా సదుపాయాలు దోహదపడతాయని తెలిపారు. పెరుగుతున్న దేశాభివృద్ధికీ, రవాణా అవసరాలకూ అనుగుణంగా సకాలంలో మౌలిక వసతులను అందించేందుకు కేంద్రం, రాష్ట్రాలు, అమలు సంస్థలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.

పీఎం గతిశక్తి–సమీకృత మౌలిక వసతుల ప్రణాళిక, భూసేకరణ?భూమి రాశి, మెరుగైన పరిహార ఒప్పందాలు?రేటింగులు, సురక్షితమైన హైవేలు?గ్రీన్ హైవేల డిజైనింగ్, రోడ్డు భద్రత?టోల్ సంస్కరణ, నాణ్యతా హామీ?ప్రాజెక్టు పర్యవేక్షణ లాంటి కీలకమైన అంశాలపై రెండు రోజుల చింతన్ శిబిర్‌లో ఇతివృత్త ఆధారిత చర్చలు చేపడతారు. అమల్లో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడం, అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతుల గురించి పంచుకోవడం, మరింత సమర్థమైన జాతీయ రహదారుల అభివృద్ధి కోసం ఆచరణాత్మకమైన, అనుసరించదగిన పరిష్కారాలను గుర్తించడమే ఈ సమావేశాల ముఖ్యోద్దేశం.

నాణ్యతను మెరుగుపరచడానికి, నిర్మాణ, నిర్వహణ వ్యయాన్ని తగ్గించడానికి నూతన సాంకేతిక పరిజ్ఞానాలను, ఆవిష్కరణాత్మకమైన నిర్మాణ పద్ధతులను అనుసరించాలని, చౌక ధరకే లభించే సామగ్రిని విస్తృతంగా వినియోగించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆవిష్కరణలను, క్షేత్రస్థాయి పరిష్కారాలను పంచుకోవాలని రాష్ట్రాలను, అమలు సంస్థలను ఆయన ప్రోత్సహించారు. రహదారుల నిర్మాణం, నిర్వహణలో పరిశోధన, సాంకేతికత, నిరంతర అభివృద్ధి ప్రాముఖ్యతను ఆయన వివరించారు.

చింతన్ శిబిర్ అజెండాలో సుస్థిరత, పర్యావరణ బాధ్యత ముఖ్యమైన అంశంగా ఉన్నాయి. పర్యావరణహితమైన నిర్మాణ పద్ధతులనూ, వినూత్నమైన, రీసైకిల్డ్ పదార్థాల వినియోగాన్నీ ప్రోత్సహించాల్సిన అవసరం గురించి శ్రీ గడ్కరీ వివరించారు. అదే సమయంలో పర్యావరణ, వన్యప్రాణుల సంరక్షణ కోసం అవసరమైన చర్యలను తీసుకోవాలన్నారు. అనంతరం 'పర్యావరణం, వన్యప్రాణుల నష్ట నివారణ చర్యలు' అనే డాక్యుమెంటును విడుదల చేశారు.

సుస్థిర రవాణాపై బ్రిక్స్ దేశాల దృక్పథాల సంకలనాన్ని కూడా ఆవిష్కరించారు. ఇది రవాణా రంగంలో సుస్థిర విధానాలకు సంబంధించిన ఆలోచనలను ఒకచోట చేర్చింది. భవిష్యత్తు అవసరాలకు తగిన మౌలిక సదుపాయాలపై చేపడుతున్న చర్చలకు అంతర్జాతీయ కోణాన్ని జోడించింది.

ఫాస్టాగ్ వార్షిక పాస్, మల్టీ?లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్‌ఎఫ్‌ఎఫ్)తో పాటు హైవే ప్రయాణ సామర్థ్యాన్ని, సౌకర్యాన్ని పెంపొందించే సాంకేతిక ఆధారిత సంస్కరణల గురించి కూడా శ్రీ గడ్కరీ వివరించారు. టోలింగ్ వ్యవస్థలను ఆధునికీకరించడానికి, ట్రాఫిక్‌ను మెరుగుపరచడానికి, మొత్తంగా జాతీయ రహదారి వినియోగ అనుభవాన్ని పెంపొందిండానికి మంత్రిత్వ శాఖ ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ కార్యక్రమాలు ప్రతిబింబిస్తున్నాయి.

చింతన్ శిబిర్‌లో చేపట్టబోయే చర్చలకు ఈ ప్రారంభ కార్యక్రమం దిశానిర్దేశం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చర్చలకు, అనుభవాలను, ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి, వినూత్నమైన, ఆచరణాత్మకమైన పరిష్కారాలను గుర్తించడానికి అవసరమైన వేదికను చింతన్ శిబిర్ అందిస్తుంది. ప్రాజెక్ట్ ప్రణాళికను, పర్యవేక్షణను బలోపేతం చేయడం, హైవే నాణ్యతను, భద్రతను మెరుగుపరచడం, సుస్థిరమైన మౌలిక సదుపాయాలను ప్రోత్సహించడం, భవిష్యత్తు అవసరాలకు తగిన హైవే మౌలిక సదుపాయాలను వేగవంతం చేయడమే రెండు రోజుల పాటు నిర్వహించే ఈ చర్చల ముఖ్యోద్దేశం.

వికసిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా వేగవంతమైన ఆర్థిక వృద్ధికీ, పటిష్టమైన అనుసంధానానికీ దోహదపడే సురక్షితమైన, అత్యంత నాణ్యమైన, భవిష్యత్తు అవసరాలకు తగిన రహదారి మౌలిక సదుపాయాల దిశగా భాగస్వాములందరూ సమిష్టిగా కృషి చేయాలని శ్రీ గడ్కరీ పిలుపునిచ్చారు.

# పోలీస్ ఉద్యోగ అభ్యర్థులకు అండ



నల్గొండ, అక్టోబర్ 6: గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి నిరుద్యోగ యువకులు పోలీస్ నియామకాలకు సిద్ధమవుతుండగా, స్థానిక హైస్కూల్ మైదానంలో పిచ్చి చెట్లు మొలిచి, రాళ్లు తేలి, గుంటలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది.

రన్నింగ్, లాంగ్ జంప్ చేసేటప్పుడు దెబ్బలు తగిలి కాళ్లు, చేతులు విరిగే ప్రమాదం ఉందని యువకులు ఆందోళన చెందారు. ఈ విషయాన్ని యువకులు కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె వెంటనే డోజర్ సహాయంతో మైదానాన్ని శుభ్రం చేయించి, యువకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యను పరిష్కరించారు.తమ విజ్ఞప్తికి స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించిన చైర్ పర్సన్ తిరుపతమ్మ సుధీర్ కు, మార్నింగ్ వాకర్స్ మరియు యువకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ఉద్యోగ నియామకాలకు సిద్ధమవుతున్న యువతీ యువకులు పట్టుదలతో ఉద్యోగాలు సాధించి, ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి, చదువు చెప్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చదువుకునే నిరుపేద విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లపు నాగేశ్వరరావు, ఎండి సమద్, మేకపోతుల దినేష్, మేకల సాయి, వీరబాబు, రిటైర్డ్ ఉద్యోగులు మండవ వెంకటేశ్వర్లు, రణబోతు అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైరా దక్షిణముఖ దాసాంజనేయ స్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు



ఖమ్మం, అక్టోబర్ 6:వైరా ప్రాజెక్టు అలుగుల వద్ద వేంచేసి ఉన్న దక్షిణముఖ దాసాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం అష్టోత్తర పూజలు, విశేష అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ట్రాన్స్కో డిపార్ట్మెంట్ ఉద్యోగి బొడ్డు రవివర్మ సత్యసాయినాథ్ జన్మదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు.

### ఆలయాన్ని దర్శించిన ప్రముఖ న్యాయవాది మందడపు శ్రీనివాసరావు

తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యుడిగా ఎన్నికైన ప్రముఖ న్యాయవాది, వైరా వాస్తవ్యులు మందడపు శ్రీనివాసరావు తమ కుమార్తె దివ్య (హైకోర్టు అడ్వకేట్)తో కలిసి దాసాంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మందడపు శ్రీనివాస రావును కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించి, హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

### ఆలయ అభివృద్ధికి సహకారం – కమిటీ అభినందనలు

ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి మందడపు శ్రీనివాసరావు నిరంతరం అందిస్తున్న సహకారాన్ని ఆలయ కమిటీ ప్రత్యేకంగా కొనియాడింది. అలాగే ఆలయ పురోభివృద్ధికి సహకరించిన ఆయన కుమార్తె దివ్యకు కూడా కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఆలయ కమిటీ చైర్మన్: చావా శ్రీనివాసరావు

కమిటీ సభ్యులు ఉ సలహాదారులు: చింతనిప్పు వెంకటేశ్వరరావు, పాపినేని రమేష్, బండారుపల్లి రవీంద్ర బాబు, చెరుకూరి శ్రీనివాసరావు, జాలాది కోటేశ్వరరావు, కొత్తూరి వెంకటరమణ, మేకా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆదిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించి, రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యులు గా ఎన్నికైన శ్రీనివాసరావు.. జన్మదిన వేడుకలు జరుపుకున్న రవివర్మ సత్యసాయినాథ్‌లు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి సమాజ సేవలో ముందుండాలని ఆశీర్వచనాలు అందించారు.

# వైరాలో పెసల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖమ్మం, అక్టోబర్ 6: వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పెసల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సోమవారం సుడా చైర్మన్ పువ్వాళ దుర్గాప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకు పంటను విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు.

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంటను నేరుగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం ద్వారా రైతులకు మద్దతు ధర లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొల్ల గంగారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వీరంశెట్టి సీతారాములు పాల్గొన్నారు.

# పెన్షనర్ల జీవన సౌలభ్యం పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 6:పెన్షనర్ల సంక్షేమం, జీవన సౌలభ్యాన్ని నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో), సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు పునరుద్ఘాటించారు. సాంకేతికత, డిజిటల్ భాగస్వామ్యం అంతిమంగా పెన్షనర్లు, వారి కుటుంబాల కోసం సరళమైన, మరింత అందుబాటులో ఉండే సేవలుగా మారాలని ఆయన స్పష్టం చేశారు.

న్యూఢిల్లీలోని ఐఐపీఏ, టి. ఎన్. చతుర్వేది మెమోరియల్ హాల్ వేదికగా పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ శాఖ (డీవోపీపీడబ్ల్యూ) నిర్వహించిన 17వ పెన్షన్ అదాలత్‌లో కేంద్ర మంత్రి పాల్గొని, ప్రసంగించారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న అనుభవాలు, ఇబ్బందుల నుంచి పెన్షన్ నిర్వహణ విభాగం నిరంతరం నేర్చుకోవాలని కేంద్ర మంత్రి సూచించారు. ప్రస్తుత వ్యవస్థలోని లోపాలను తొలగించడానికి కృషి చేయాలనీ పేర్కొన్నారు. నేటి అదాలత్‌లో 897 ఫిర్యాదుల్లో 756 పరిష్కరించగా, 84.2 శాతం పరిష్కార రేటు నమోదైంది. 2017లో 'పంచాయత్ అదాలత్' భావనను ప్రవేశపెట్టినందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనను కేంద్ర మంత్రి ప్రశంసించారు.

పెన్షన్ పంపిణీలోని లోపాలను గుర్తించి, నిరంతర మెరుగుదల ద్వారా వాటిని సరిదిద్దాల్సిన ప్రాముఖ్యతనూ కేంద్ర మంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. పెన్షన్ సంస్కరణల లక్ష్యం కేవలం సాంకేతిక పురోగతి మాత్రమే కాదనీ... సంస్కరణల ప్రయోజనాలు చివరి వరకు చేరి, పెన్షనర్ల కోసం స్పష్టమైన మార్పును తీసుకురావడమేనని ఆయన అన్నారు.

కుటుంబ పెన్షనర్లు, అత్యంత వృద్ధులైన పెన్షనర్లకు సంబంధించిన 897 ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు 17వ పెన్షన్ అదాలత్ వాటిని విచారించింది. ఈ రోజు వాటిలో 756 కేసులు పరిష్కరించగా, పరిష్కార రేటు 84.2 శాతంగా నమోదైంది. మిగిలిన కేసులనూ రాబోయే రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇది సకాలంలో ఫిర్యాదుల పరిష్కారం, పెన్షనర్ల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిరంతర శ్రద్ధను తెలియజేస్తుంది.

పెన్షన్ సంబంధిత సేవల్లో డిజిటల్ సాంకేతికత వినియోగం పెరుగుతోందని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. డిజిటల్ గుర్తింపు, ముఖ గుర్తింపు ఆధారిత విధానాల ద్వారా ప్రక్రియలను సరళతరం చేసేందుకు కృషి జరుగుతోందని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న డిజిటల్ సేవలను పెన్షనర్లు పూర్తిగా వినియోగించుకునేలా, అటువంటి సౌకర్యాల గురించి వారికి నిరంతరం సమాచారం అందించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ... పెన్షనర్లు సౌకర్యవంతంగా డిజిటల్ సర్టిఫికెట్లను పొందేలా చూడటంలో ప్రచారాలు, అవగాహన కార్యక్రమాల ప్రాముఖ్యతను మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా గణనీయ స్థాయిలో పురోగతి సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. మరింత అవగాహన, విస్తృత ప్రచారం వాటి ప్రభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు.

దేశవ్యాప్తంగా ఉన్న పెన్షనర్లకు పెన్షన్ సంస్కరణలను చేరవేయడంలో మీడియా, ప్రజా సమాచార ప్రసార విభాగాల పాత్రను డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రముఖంగా ప్రస్తావించారు. గతంలో నిర్వహించిన అవగాహన ప్రచారాల ద్వారా సాధించిన సానుకూల ఫలితాలను ప్రస్తావిస్తూ... పెన్షనర్లు, వారి కుటుంబాలు అందుబాటులో ఉన్న సేవలు, సంస్కరణల గురించి ఎప్పటికప్పుడు సమాచారం పొందేలా చూసేందుకు ఆధునిక సమాచార ప్రసార సాధనాలను ఉపయోగించే ప్రయత్నాలను కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

సాధారణ సర్వీస్ డెలివరీకే కాకుండా సమస్యలను గుర్తించి మొత్తం పెన్షన్ నిర్వహణ వ్యవస్థను మెరుగుపరచడానికీ సాంకేతికతను ఉపయోగించాలని కేంద్ర మంత్రి అన్నారు. ఎక్కడైనా అంతరాలు లేదా నివారించదగిన ఇబ్బందులు గమనించినట్లయితే, వాటిని నివేదించి పరిష్కరించాలని కేంద్ర మంత్రి సూచించారు. తద్వారా వ్యవస్థ నిరంతరం మెరుగుపడుతుందని ఆయన అన్నారు.

పెన్షనర్ల సంక్షేమం ప్రభుత్వ విధానంలో కీలకమని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. సాంకేతికపరమైన చర్యలు చేపట్టినప్పుడు... పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్ల అవసరాల పట్ల సున్నితమైన దృక్పథమూ ఉండాలని ఆయన పేర్కొన్నారు.

పెన్షన్ సంబంధిత విధానాలను సరళీకృతం చేయడానికి, పెన్షనర్ల కుటుంబాలకు మద్దతును మెరుగుపరచడానికి కొనసాగుతున్న ప్రయత్నాలనూ కేంద్ర మంత్రి ప్రస్తావించారు. సంస్కరణలు లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఆచరణాత్మక ఇబ్బందులపైనే దృష్టి సారించాలనీ, మరింత జీవన సౌలభ్యానికి అవి దోహదపడాలని ఆయన స్పష్టం చేశారు.

పెన్షన్ ఫిర్యాదులను సమర్పించి, పరిశీలించడం కోసం పెన్షనర్లను, సంబంధిత మంత్రిత్వ శాఖలను, విభాగాలను 17వ పెన్షన్ అదాలత్ ఒకచోట చేర్చింది. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ జితేంద్ర సింగ్ సమక్షంలో... సంయుక్త కార్యదర్శి (పెన్షన్) కేసుల ప్రజెంటేషన్ సమర్పించారు. ఈ కార్యకలాపాలు ఫిర్యాదులను నేరుగా పరిశీలించడానికి వీలు కల్పించాయి. వాటిని త్వరితగతిన పరిష్కరించడం కోసం సమన్వయ ప్రయత్నాలకూ తోడ్పడ్డాయి.

అదాలత్ సందర్భంగా... 16వ పెన్షన్ అదాలత్ విజయ గాథలపై కరపత్రాలు, "కుటుంబ పెన్షనర్ల జీవితంలో సౌలభ్యం" అనే ఇ-పుస్తకాన్నీ విడుదల చేశారు. సమర్థమైన ఫిర్యాదుల పరిష్కారం, పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్ల అనుభవాన్ని మెరుగుపరచడం కోసం ప్రభుత్వం చేస్తున్న నిరంతర ప్రయత్నాలను ఈ ప్రచురణలు ప్రముఖంగా తెలియజేస్తున్నాయి.

పెన్షనర్ల సమస్యలను అర్థవంతంగా, సులభంగా, వేగంగా పరిష్కరించడం కోసం 'పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ' రూపొందించిన వ్యవస్థాగత యంత్రాంగంలో 17వ పెన్షన్ అదాలత్ ఒక భాగం.

1973లో తన భర్త ప్రాణత్యాగం చేసిన శ్రీమతి చందర్ కాంతా జల్లీ గారిది ఒక ఆదర్శప్రాయమైన ఉదంతం. ఆమెకు సరళీకృత కుటుంబ పెన్షన్ మంజూరైంది. అయితే, కొన్ని కారణాల వల్ల ఆమెకు అర్హత ఉన్న మొత్తం కంటే తక్కువ కుటుంబ పెన్షన్ చెల్లించారు. ఈ విషయంగా ఆమె పలు వేదికలను ఆశ్రయించారు. పెన్షన్ అదాలత్ సందర్భంగా... ఆమె కుమారుడు శ్రీ జస్విందర్ జల్లీ చండీగఢ్ నుంచి వీడియో అనుసంధానం ద్వారా హాజరై, గౌరవ సహాయ మంత్రి (పీపీ) గారి ముందు తన తల్లి తరపున ఫిర్యాదును సమర్పించారు. ఈ కేసుపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. అనంతరం రూ. 2.02 కోట్ల కుటుంబ పెన్షను బకాయిలను విడుదల చేశారు.

శ్రీమతి దమయంతి సిన్హాకు సంబంధించిన మరో కేసులోనూ 'పెన్షన్ అదాలత్' సహాయంతో 72 లక్షల రూపాయలకు పైగా పెన్షన్ ప్రయోజనాలు విడుదలయ్యాయి.

# సీపీఎం, సీపీఐ నాయకుల ధర్నా

## కేంద్ర ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలి



మహబూబ్‌నగర్, అక్టోబర్ 6: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించి, అరెస్టు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు భారీ ధర్నా నిర్వహించారు.సీపీఎం జిల్లా సీనియర్ కార్యవర్గ సభ్యులు ఆర్. శీను అధ్యక్షత వహించిన ఈ ఆందోళనకు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎండీ. ఫయాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శి బి. పర్వతాలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వ్యవస్థలను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వారు మండిపడ్డారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే పదవి నుండి తొలగించి, అరెస్ట్ చేయాలి.బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఎన్నికలు జరిగిన ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల ఎన్నికలను రద్దు చేయాలి. అక్రమంగా తొలగించిన 13 కోట్ల ఓట్లను వెంటనే తిరిగి చేర్చాలి. వివాదాస్పద 'ఫామ్-6'ను సవరించడంతో పాటు, ఈసీ నియామక నిబంధనలలో మార్పులు తీసుకురావాలి. ఆందోళన చేస్తున్న విద్యార్థులు, మహిళా జర్నలిస్టులపై పోలీసులు ప్రదర్శిస్తున్న నిర్బంధాన్ని ఖండించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్, సీపీఎం జిల్లా నాయకురాలు గీత, అలాగే ఇరు పార్టీల జిల్లా నాయకులు మారేడు శివశంకర్, తుమ్మల బీజ్జా, శ్రీనివాసులు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు టి. మల్లేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. ప్రేమ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మధు గౌడ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు.

# సుధాకర్ మృతదేహాన్ని చూసేందుకు వెళ్లకుండా అడ్డగింత.. పోలీసుల తీరుపై వేముల ఆగ్రహం

కామారెడ్డి, అక్టోబర్ 6:(నేటినిజం ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్యకు యత్నించి ప్రాణాలు కోల్పోయిన టీ స్టాల్ నిర్వాహకుడు సుధాకర్ మృతదేహాన్ని నివాళులర్పించేందుకు వెళ్లకుండా మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసం వద్దే పోలీసులు నిలిపివేయడంతో భీమ్‌గల్ వెళ్లలేకపోయారు.

ఈ సందర్భంగా పోలీసుల తీరుపై వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "చనిపోయిన వ్యక్తిని కడసారి చూసేందుకు కూడా వెళ్లనివ్వరా? కనీసం చివరి చూపు చూసి నివాళులర్పించే అవకాశం కూడా లేదా?" అని ప్రశ్నించారు.

పోలాస సుధాకర్ ఎలాంటి రాజకీయ పార్టీతో సంబంధం లేని సాధారణ వ్యక్తి అని, టీ స్టాల్ నిర్వహించుకుంటూ జీవనం సాగించేవారని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చివరకు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

తన నియోజకవర్గానికి చెందిన వ్యక్తి మృతిచెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతదేహానికి నివాళులర్పించేందుకు మాత్రమే తాను వెళ్తున్నానని చెప్పారు.

# 'చాయ్ వాలా' ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ సుధాకర్ మృతి

నిజామాబాద్, అక్టోబర్ 6:పోలీసుల వేధింపులు తాళలేక భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసిన హోటల్ నిర్వాహకుడు పొలాస సుధాకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

భీమ్‌గల్ పట్టణానికి చెందిన పొలాస సుధాకర్ స్థానికంగా చాయ్ హోటల్ నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి వరకు హోటల్ తెరిచి ఉంచుతున్నాడనే నెపంతో పోలీసులు ఇటీవల అతనిపై వరుస కేసులు నమోదు చేశారు. సోమవారం విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు రావాలని పోలీసులు ఆదేశించారు. స్టేషన్‌కు వెళ్లిన సుధాకర్‌ను కోర్టుకు వెళ్లాలని సూచించడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు.

దానితో ప్లాస్టిక్ బాటిల్‌లో వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను పోలీస్ స్టేషన్ ఆవరణలోనే ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు వెంటనే మంటలను ఆర్పి, మొదట నిజామాబాద్ ఉఉఉకి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సుధాకర్ మంగళవారం ఉదయం కన్నుమూశాడు.

స్థానిక కిరాణా వ్యాపారి ఒత్తిడి మేరకే పోలీసులు తనపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని సుధాకర్ ఆరోపించాడు. అయితే ఆసుపత్రిలో సుధాకర్ ఇచ్చిన మరో స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ కేసులో పోలీసుల వేధింపులు కారణం కాదని పోలీస్ కమిషనర్ (అఖ) అధికారిక ప్రకటన విడుదల చేశారు.

ఈ ఘటనపై స్పందించిన బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పోలీసుల వేధింపుల వల్లే సుధాకర్ ఆత్మహత్య చేసుకున్నాడని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాధ్యుడైన భీమ్‌గల్ ఎస్ఐ తిరుపతిపై కేసు నమోదు చేసి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం పిలుపునిచ్చిన భీమ్‌గల్ బంద్ ప్రశాంతంగా, విజయవంతంగా సాగుతోంది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి నిరసన తెలిపారు. కాగా, మృతి చెందిన సుధాకర్ కుటుంబానికి పరామర్శ తెలిపేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని పోలీసులు ఆయన నివాసంలోనే ముందస్తుగా అరెస్ట్ చేశారు.

# మున్సిపల్ కార్మికుల వేతనాలు తగ్గించొద్దు



మహబూబ్‌నగర్, అక్టోబర్ 6: భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికుల వేతనాలను తగ్గించకుండా, గతంలో చెల్లిస్తున్న వేతనాలనే కొనసాగించాలని కోరుతూ కార్మికులు దేవరకద్ర ఎమ్మెల్యే గావినోళ్ల మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన ఉ.ా.ఖీబి.ఔనీ.1181, తేదీ 12-07-2026 అమలులోకి వచ్చిన తర్వాత గతంలో చెల్లిస్తున్న వేతనాల కంటే తక్కువగా చెల్లిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తమ కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని, వేతనాల తగ్గింపును నిలిపివేసి పాత వేతనాలనే కొనసాగించాలని కోరారు.

ఉ.ా.ఖీబి.ఔనీ.1181ను రద్దు చేసి, గతంలో అమలు చేసిన ఉ.ా.ఓబ.ఔనీ.60 ప్రకారం వేతనాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. పబ్లిక్ హెల్త్ వర్కర్, నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి, ప్లంబర్, ఫిట్టర్, డ్రైవర్, వర్క్ ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్ తదితర హోదాలను యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలను విన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని సీడీఎంఏ శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా మాట్లాడతానని తెలిపారు. మున్సిపల్ కార్మికులకు వేతన పరిరక్షణ కల్పించేలా ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపాలిటీకి చెందిన కంప్యూటర్ ఆపరేటర్లు రాజేష్, సాదీద్, దేవరకద్ర మున్సిపాలిటీకి చెందిన సురేష్, ప్రసన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కునో జాతీయ పార్కులో 5 కూనలకు జన్మనిచ్చిన చీతా

న్యూఢిల్లీ, అక్టోబర్ 6:భారత్‌లో పుట్టిన 32 నెలల చీతా 'కేజీపీ-21' కునో జాతీయ పార్కులో ఈ రోజు అయిదు కూనలకు జన్మనిచ్చింది. పూర్తి ఆరోగ్యంతో ఉన్న ఈ పిల్ల చీతాలతో భారత్‌లో చీతాల సంఖ్య 60కి చేరింది. వాటిలో 41 భారత్‌లోనే జన్మించడం గమనార్హం. ప్రాజెక్టు చీతాలో మరొక చరిత్రాత్మక ప్రస్థానం.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ఈ విషయాన్ని ప్రజలతో పంచుకున్నారు. ముఖి, కేజీపీ- 12 తర్వాత పిల్లలకు జన్మనిచ్చిన మూడో భారతీయ సంతతి ఆడ చీతా 'కేజీపీ-21' అని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో తదుపరి తరం చీతాల అభివృద్ధిలో ఇదొక కీలకమైన ప్రస్థానంగా ఆయన అభివర్ణించారు. ఈ అయిదు పిల్లలకూ బోట్సువానాకు చెందిన మగ చీతా తండ్రి అనీ, దీంతో వాటి జననం భారత్‌లో బోట్సువానా సంతతికి కూడా నాంది పలుకుతోందనీ శ్రీ యాదవ్ తెలిపారు. దీంతో దేశంలో క్రమంగా పెరుగుతున్న చీతాల సంఖ్యకు.. తాజా పరిణామంతో కొత్త జన్యుపరంపర తోడైందన్నారు. భారత్‌లో జన్మించిన భవిష్యత్ తరం చీతాలుగా కేంద్ర మంత్రి ఈ పరిణామాన్ని అభివర్ణించారు. భారత్‌లో చీతాల పునఃప్రవేశ కథనంలో ఇదొక సరికొత్త అధ్యాయమన్నారు. ప్రాజెక్ట్ చీతాతో అనుబంధమున్న పశువైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది, మేనేజర్లందరికీ శ్రీ యాదవ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వారి అంకితభావం, నిబద్ధత వల్లే చీతాల సంరక్షణలో ఈ పరిణామం సాధ్యమైందన్నారు.

# ఘనంగా బతుకమ్మ ,తీజ్ వేడుకలు..



నిజామాబాద్, అక్టోబర్ 6: మండల కేంద్రంలోని అహ్మద్ బి.ఎడ్. కళాశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళలను ప్రతిబింబించేలా బతుకమ్మ,బోనాలు , తీజ్ పండగ సాంస్కృతిక వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని, రంగురంగుల పుష్పాలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తయారు చేశారు. బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో వేడుకను ఉత్సాహభరితంగా నిర్వహించారు. బోనాల సంప్రదాయాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించి, తెలంగాణ సంస్కృతి విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి హనీ పాషా మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ విలువలను పరిచయం చేయడం ఎంతో ముఖ్యమని" పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంస్కృతిక అవగాహన, ఐక్యత, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఛాత్రో ఉపాధ్యాయులు , సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ముందస్తు అరెస్టు



నిజామాబాద్, అక్టోబర్ 6: భీంగల్ పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పొలాస సుధాకర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

సుమారు 90 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న సుధాకర్ మృతి చెందడంతో ఆయనకు నివాళులర్పించేందుకు బయలుదేరిన మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసినట్లు సమాచారం. ఈ ఘటనకు పోలీసుల వేధింపులే కారణమని సుధాకర్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. అయితే పోలీసుల వైపు తప్పిదం లేదని నిజామాబాద్ సీపీ పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. సుధాకర్ ఆత్మహత్యాయత్నం అనంతరం మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్పందిస్తూ ఎస్సై తిరుపతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరడంతో పాటు, భీంగల్ బంద్‌కు కూడా పిలుపునిచ్చారు. సుధాకర్ మృతి నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహానికి నివాళులర్పించేందుకు వెళ్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# పెన్షనర్ల జీవన సౌలభ్యం పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 6:పెన్షనర్ల సంక్షేమం, జీవన సౌలభ్యాన్ని నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో), సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు పునరుద్ఘాటించారు. సాంకేతికత, డిజిటల్ భాగస్వామ్యం అంతిమంగా పెన్షనర్లు, వారి కుటుంబాల కోసం సరళమైన, మరింత అందుబాటులో ఉండే సేవలుగా మారాలని ఆయన స్పష్టం చేశారు.

న్యూఢిల్లీలోని ఐఐపీఏ, టి. ఎన్. చతుర్వేది మెమోరియల్ హాల్ వేదికగా పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ శాఖ (డీవోపీపీడబ్ల్యూ) నిర్వహించిన 17వ పెన్షన్ అదాలత్‌లో కేంద్ర మంత్రి పాల్గొని, ప్రసంగించారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న అనుభవాలు, ఇబ్బందుల నుంచి పెన్షన్ నిర్వహణ విభాగం నిరంతరం నేర్చుకోవాలని కేంద్ర మంత్రి సూచించారు. ప్రస్తుత వ్యవస్థలోని లోపాలను తొలగించడానికి కృషి చేయాలనీ పేర్కొన్నారు. నేటి అదాలత్‌లో 897 ఫిర్యాదుల్లో 756 పరిష్కరించగా, 84.2 శాతం పరిష్కార రేటు నమోదైంది. 2017లో 'పంచాయత్ అదాలత్' భావనను ప్రవేశపెట్టినందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనను కేంద్ర మంత్రి ప్రశంసించారు.

పెన్షన్ పంపిణీలోని లోపాలను గుర్తించి, నిరంతర మెరుగుదల ద్వారా వాటిని సరిదిద్దాల్సిన ప్రాముఖ్యతనూ కేంద్ర మంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. పెన్షన్ సంస్కరణల లక్ష్యం కేవలం సాంకేతిక పురోగతి మాత్రమే కాదనీ... సంస్కరణల ప్రయోజనాలు చివరి వరకు చేరి, పెన్షనర్ల కోసం స్పష్టమైన మార్పును తీసుకురావడమేనని ఆయన అన్నారు.

కుటుంబ పెన్షనర్లు, అత్యంత వృద్ధులైన పెన్షనర్లకు సంబంధించిన 897 ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు 17వ పెన్షన్ అదాలత్ వాటిని విచారించింది. ఈ రోజు వాటిలో 756 కేసులు పరిష్కరించగా, పరిష్కార రేటు 84.2 శాతంగా నమోదైంది. మిగిలిన కేసులనూ రాబోయే రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇది సకాలంలో ఫిర్యాదుల పరిష్కారం, పెన్షనర్ల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిరంతర శ్రద్ధను తెలియజేస్తుంది.

పెన్షన్ సంబంధిత సేవల్లో డిజిటల్ సాంకేతికత వినియోగం పెరుగుతోందని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. డిజిటల్ గుర్తింపు, ముఖ గుర్తింపు ఆధారిత విధానాల ద్వారా ప్రక్రియలను సరళతరం చేసేందుకు కృషి జరుగుతోందని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న డిజిటల్ సేవలను పెన్షనర్లు పూర్తిగా వినియోగించుకునేలా, అటువంటి సౌకర్యాల గురించి వారికి నిరంతరం సమాచారం అందించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ... పెన్షనర్లు సౌకర్యవంతంగా డిజిటల్ సర్టిఫికెట్లను పొందేలా చూడటంలో ప్రచారాలు, అవగాహన కార్యక్రమాల ప్రాముఖ్యతను మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా గణనీయ స్థాయిలో పురోగతి సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. మరింత అవగాహన, విస్తృత ప్రచారం వాటి ప్రభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు.



# వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత



వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు కనుమరుగై పోతున్నాయి. ఇలా జంతువుల జాతులు అంతరించి పోకుండా, వాటిని పరిరక్షించడమే వన్య ప్రాణుల వారోత్సవాల ముఖ్యోద్దేశం. ఏటా అక్టోబర్ మొదటి వారంలో దినోత్సవాన్ని అంతర్జా తీయంగా నిర్వహిస్తున్నారు. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, జంతువుల హక్కులను కాపాడటం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. ప్రపంచ వ్యాప్తంగా వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థక మవుతున్న నేపథ్యంలో.. వాటి సంరక్షణ ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ప్రతీ ఏటా అన్ని దేశాలు దీన్ని వన్య ప్రాణుల దినోత్సవాన్ని జరుపుతున్నాయి.

వన్య ప్రాణుల సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు.. వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడుకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యం లోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటి సారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడు లోని వేదాంతంగల్‌లో ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1935లో మొదటి వన్య ప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల సంఖ్య 102.

1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి చట్టం 1972, వన్యప్రాణులను వేటాడటాన్ని పూర్తిగా నిషేధించింది.

ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని

## వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా




ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. ఈ చట్టం అమలులోకి వచ్చాక.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 23 టైగర్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 441వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాలు ఉండగా.. వీటిల్లో 28 టైగర్ జోన్స్ ఉన్నాయి.

అంతర్జాతీయంగా పులి చర్మానికి, గోళ్లకు, ఎముకలకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో.. వేటగాళ్ల చేతిలో చిరుతల బలైపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశవ్యాప్తంగా ఉన్న అడవుల్లో దాదాపు నలభై వేలకు పైగా ఉన్న పులులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ 1972 నాటికే ఆ సంఖ్య మూడు వేలకు పడిపోయిందంటే.. అప్పటి ప్రభుత్వాలు ఎంతటి నిర్లక్ష్య వైఖరి అవలంభించాయో స్పష్టంగా అర్థమవుతోంది. సాధారణంగా పులుల జనాభాను లెక్కించేందుకు ఇంతకు ముందు పాదముద్రలను గుర్తించడం ఒక్కటే మార్గం. అవి సంచరించే ప్రాంతాల్లో రహస్య కెమెరాలను ఏర్పాటు చేసి.. వాటి పాదముద్రలను సేకరించేవారు. అయితే ఇది చాలా కష్టంతో కూడుకున్న పని. కచ్చితమైన లెక్కకు ఆస్కారం కూడా తక్కువే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) పులుల మలం ద్వారా వాటిని లెక్కించే పద్ధతిని ఆవిష్కరించింది. 20వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు లక్ష పైచిలుకు పులులు ఉండేవి అని అంచనా. 2014 లెక్కల ప్రకారం ప్రపంచంలో 3891 పులులు ఉండగా వాటిలో 2226 మన దేశంలోనే ఉన్నాయి. భారత్‌లో 2011 లెక్కల ప్రకారం 1706, 2014 ప్రకారం 2226 ఉండగా 2018 పులుల గణన ప్రకారం మన దేశంలో 2967 పులులున్నాయి. ప్రపంచంలో ఉన్న మొత్తం పులుల్లో 70శాతం పైగా మనదేశం లోనే ఉన్నాయి. గడిచిన కొన్నేళ్లలో ఒక్క మధ్య ప్రదేశ్‌లోనే 19 పులులు మృత్యువాత పడ్డాయి. మహారాష్ట్రలో 9, ఉత్తరాఖండ్‌లో 9 మృత్యువాత పడ్డాయి. 2016లో దేశవ్యాప్తంగా74 పులులు మరణించినట్టు లెక్కలు చెబుతున్నాయి. 2006లో పులులను స్మగ్లర్ల బారి నుండి కాపాడటానికి టైగర్ టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు.

భారత దేశంలో పశ్చిమ కనుమలు, నల్లమల కొండలు, శేషాచలం కొండలు, హిమాలయాలు, దేశ ఈశాన్యప్రాంతం విభిన్న జంతు జీవ జాలానికి నిలయంగా ఉన్నాయి. మానవుడికి, జంతువులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ దినోత్సవం తెలియ జేస్తుంది. ఈ రోజున జంతు సంక్షేమ ప్రచారాలతో పాటు జంతు పరిరక్షక శిబిరాలను ప్రారంభించడం, జంతు సంరక్షణకు నిధులు సేకరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. దేశంలో అడవులు అన్యాక్రాంత మవుతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఎక్కడ చూసినా పచ్చదనంతో బాసిల్లే అటవీ ప్రాంతాలు రాను రాను కనుమరుగై పోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాల్లోకీ, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ వన్య ప్రాణుల దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి. జంతువులకు సహజ సిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ఇవే ప్రధానం.

-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



# అలుగునూర్-2 అంగన్వాడి కేంద్రంలో ఘనంగా 'అంగన్ మిలన్ సేవ' 'అంగన్వాడి ఉత్సవ్'



కరీంనగర్, అక్టోబర్ 6: (నేటినిజం ప్రతినిధి) దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజున అలుగునూర్-2 అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన 'అంగన్ మిలన్ సేవ' - 'అంగన్వాడి ఉత్సవ్' కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల సమగ్ర అభివృద్ధికి, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో కేంద్రం అమలు చేస్తున్న పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. చిన్నారుల సంరక్షణలో, అంకితభావంతో సేవలు అందిస్తున్న స్థానిక అంగన్వాడి టీచర్ లతను ఈ వేదికగా ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. అనంతరం చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షులు చిందం అంజి, అంగన్వాడి సిబ్బంది, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు లభ్యత నుంచి ఇంధన భద్రత దిశగా: విద్యుత్ రంగానికి బొగ్గు , సరాఫరాను బలోపేతం చేస్తున్న సీఐఎల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 6:భారత్ విద్యుత్ రంగానికి బొగ్గు అంత్యంత కీలకమైనది. గనుల తవ్వకం నుంచి రవాణా, విద్యుత్ ఉత్పత్తి, వినియోగదారులకు విద్యుత్ చేరే వరకు మొత్తం వ్యవస్థలో బొగ్గు కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సరఫరా వ్యవస్థలో బొగ్గులో దాదాపు అయిదింట నాలుగు వంతుల (80 శాతం) భాగాన్ని విద్యుత్ రంగానికే సరఫరా చేసే కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) కీలక స్థానంలో ఉంది.

ఇటీవల సీఐఎల్ పనితీరుతో బొగ్గుసరఫరా వ్యవస్థ మరింత బలోపేతం అవుతున్నట్లు స్పష్టమవుతోంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2026-27లో బొగ్గు రవాణా, ముఖ్యంగా విద్యుత్ రంగానికి సరఫరా గణనీయంగా మెరుగుపడింది. బొగ్గు రవాణా సామర్థ్యం పెరగడం, ఉత్పత్తి, రవాణాల మధ్య మెరుగైన సమన్వయం, గనుల వద్ద ఇప్పటికే ఉన్న బొగ్గు నిల్వలను వినియోగించడం ఇందుకు దోహదపడ్డాయి.

2026-27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో సీఐఎల్ మొత్తం 384.2 మిలియన్ టన్నుల(ఎంటీ) బొగ్గును సరఫరా చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సరఫరా చేసిన 357 మిలియన్ టన్నులతో పోలిస్తే ఇది 27.2 మిలియన్ టన్నులు లేదా 7.6 శాతం అధికం.

రెండో త్రైమాసికంలో ఈ సరఫరా మరింత పెరిగింది. 2026-27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో సీఐఎల్ బొగ్గు సరఫరా 186.04 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇదే గత ఏడాది రెండో త్రైమాసికంలో 166.04 మిలియన్ టన్నులుగా ఉంది. ఈసారి 12.05 శాతం వృద్ధి నమోదైంది. దీంతో బొగ్గు సరఫరా పెరుగుదల ఒక్క నెలకే పరిమితం కాకుండా, త్రైమాసికం మొత్తం మరింత స్పష్టంగా కనిపించింది.

సెప్టెంబర్‌లో బొగ్గు సరఫరా మరిత మెరుగైన ఫలితాలను అందించింది. ఆ నెలలో సీఐఎల్ మొత్తం బొగ్గు సరఫరా 61.20 మిలియన్ టన్నులకు పెరిగింది. 2025 సెప్టెంబర్‌లో ఇది 54.40 మిలియన్ టన్నులుగా ఉంది. దీంతో ఈసారి బొగ్గు సరఫరాలో 12.5 శాతం వృద్ధి నమోదైంది.

2026-27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో గనుల వద్ద ఉన్న బొగ్గు నిల్వల్లో సీఐఎల్ 63 మిలియన్ టన్నులను సరఫరా చేసింది. దీంతో బొగ్గు సరఫరా పెరగడానికి ప్రస్తుత ఉత్పత్తి మాత్రమే కాకుండా, ఇప్పటికే ఉన్న బొగ్గు నిల్వలను మెరుగ్గా వినియోగించుకోవడం కూడా దోహదపడిందని అర్థమవుతోంది.

2026-27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో విద్యుత్ రంగానికి సీఐఎల్ సరఫరా చేసిన బొగ్గు పరిమాణం 302.8 మిలియన్ టన్నులుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 285.4 మిలియన్ టన్నులుగా నమోదైంది. ఈసారి 17.4 మిలియన్ టన్నులు లేదా 6.1 శాతం పెరుగుదల కనిపించింది. మొత్తం మీద 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో సీఐఎల్ సరఫరా చేసిన మొత్తం బొగ్గులో దాదాపు 79 శాతం విద్యుత్ రంగానికే చేరింది. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు సరఫరాకే సీఐఎల్ పంపిణీ వ్యూహంలో అత్యధిక ప్రాధాన్యం ఉందని ఇది మరోసారి స్పష్టం చేస్తోంది.

రెండో త్రైమాసికం (క్యూ2)లో నమోదైన పనితీరు ఎంతో ప్రత్యేకమైనది. 2026-27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో విద్యుత్ రంగానికి 148.20 మిలియన్ టన్నుల బొగ్గును సీఐఎల్ సరఫరా చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో 133.50 మిలియన్ టన్నులు సరఫరా చేయగా.. ఈసారి 11 శాతం వృద్ధి నమోదైంది.

బొగ్గు సరఫరాలో మెరుగుదల అన్ని స్థాయిల్లో కనిపిస్తోంది. మొత్తం బొగ్గు సరఫరా పెరగడంతో పాటు, విద్యుత్ కేంద్రాలకు చేరుతున్న బొగ్గు పరిమాణం కూడా పెరుగుతోంది.

# త్వరలోనే రైతులకు హెచ్ఎండీఏ ప్లాట్లు

**ఆరుట్ల, ఫసల్‌వాది, కంది లే అవుట్లపై కలెక్టర్ సమీక్ష**

**పెండింగ్ పనులు వేగవంతం చేయాలని జగ్గారెడ్డి, నిర్మల సూచన**

సంగారెడ్డి, అక్టోబర్ 6:(నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్ లే అవుట్లపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం సాయంత్రం హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి పాల్గొని లే అవుట్ల పురోగతిపై అధికారులతో చర్చించారు.

ఆరుట్ల, ఇంద్రకరణ్, ఫసల్‌వాది, కంది ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ కింద భూములు తీసుకుని రైతులకు సర్టిఫికెట్లు అందించినప్పటికీ, ఇప్పటివరకు ప్లాట్ల పొజిషన్ ఇవ్వకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్న విషయాన్ని జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి సమావేశంలో ప్రస్తావించారు. ఆయా ప్రాంతాల్లో లే అవుట్ల పనుల పురోగతి, జాప్యానికి కారణాలు, పూర్తయిన పనుల వివరాలను హెచ్ఎండీఏ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఆరుట్ల లే అవుట్ పరిధిలో 106 ఎకరాల 14 గుంటల్లో లే అవుట్ ప్రక్రియ పూర్తయిందని అధికారులు తెలిపారు. అయితే లబ్ధిదారుల జాబితా ఇంకా అందాల్సి ఉందని వివరించారు.

ఫసల్‌వాది ప్రాంతంలో ఇప్పటివరకు సుమారు 60 శాతం భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. కొంత ప్రాంతంలో రైతుల నుంచి అభ్యంతరాలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

కంది గ్రామంలో 50 ఎకరాలకు హెచ్ఎండీఏ లే అవుట్ ప్రతిపాదించగా, ప్రస్తుతం 46 ఎకరాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. లబ్ధిదారుల జాబితా ఇంకా అందలేదని పేర్కొన్నారు. కంది లే అవుట్ పనులను అక్టోబర్ 10లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కంది, ఫసల్‌వాది లే అవుట్ల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. కంది, ఫసల్‌వాది, ఆరుట్ల లే అవుట్లలో నవంబర్ చివరికల్లా ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు సమావేశంలో తెలిపారు. భూములు కోల్పోయిన రైతులు సంవత్సరాలుగా ప్లాట్ల కోసం ఎదురుచూస్తున్నందున ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా మిగిలిన పనులను పూర్తి చేసి ప్లాట్లు కేటాయించాలని జగ్గారెడ్డి కోరారు. రైతుల సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్మల జగ్గారెడ్డి సూచించారు. నవంబర్ చివరికల్లా హెచ్ఎండీఏ లే అవుట్లలో భూములు కోల్పోయిన రైతులందరికీ ప్లాట్లు కేటాయించేలా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

# వికారాబాద్‌లో పోషణ మహోత్సవం

**పిల్లలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం : జిల్లా సంక్షేమ అధికారి కాంతారావు**




హైదరాబాద్, అక్టోబర్ 6:వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మహోత్సవం నిర్వహించారు. జిల్లాలోని ఐదు ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ అధికారి కాంతారావు ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధాకర్‌లాల్, బీసీ సంక్షేమ అధికారి మాధవరెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారి జైపాల్‌రెడ్డి, జిల్లా పీఆర్వో చిన్నమ్మ తదితర జిల్లా అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వికారాబాద్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పోషణ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ డివిజన్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ సందేశాలకు ఎవరూ స్పందించవద్దు

**ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి.జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు.**

ములుగు, అక్టోబర్ 6:(నేటినిజం ప్రతినిధి): తన పేరు, ఫొటోను ఉపయోగించి గుర్తుతెలియని వ్యక్తులు పంపుతున్న నకిలీ వాట్సాప్ సందేశాలకు ఎవరూ స్పందించవద్దని,ప్రజలు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తన పేరు, ఫొటోను వాట్సాప్ డి.పి.లో పెట్టుకుని +66 98 476 2993 నంబర్ నుంచి అధికారులకు సందేశాలు పంపుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ నంబర్ నుంచి వచ్చే సందేశాలను నమ్మవద్దని, వెంటనే సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేసి, వాట్సాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

తన పేరు, ఫొటో కనిపించినంత మాత్రాన అపరిచిత నంబర్ల నుంచి వచ్చే సందేశాలను విశ్వసించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాంటి సందేశాల ద్వారా డబ్బులు, బహుమతి కార్డులు అడిగినా స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, రహస్య సంకేత సంఖ్యలను ఎవరికీ ఇవ్వవద్దని కోరారు.

సైబర్ నేరగాళ్లు ప్రముఖుల పేర్లు, ఫొటోలను ఉపయోగించి ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. తన పేరుతో అనుమానాస్పద సందేశాలు వస్తే సంబంధిత సైబర్ నేరాల విభాగం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రజలు,



అధికారులు, సిబ్బంది జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

# ఇంద్రనగర్‌లో కార్డ్ అండ్ సెర్చ్

**పెద్ద ఎత్తున వాహనాలు స్వాధీనం వెల్లడించిన జిల్లా ఎస్పీ స్నేహమేరా**

వికారాబాద్, తిరుపతి, అక్టోబర్ 6:వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 30 వార్డు ఇంద్రనగర్ కరీంనగర్ కాలనీలో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహమేరా ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా పోలీసులు కార్డ్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. సరైన దృవపత్రాలు లేని భారీ వాహనాలను ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహమేరా మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి అన్నారు. సరైన ధ్రువపుత్ర లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటామని వాటి ధ్రువపత్రాలు చూయించి తీసుకువెళ్లాలని అన్నారు. అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య సీఐ రఘుకుమార్ వివిధ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేవీకే కొత్తగూడెంలో పొద్దుతిరుగుడు హైబ్రిడ్ విత్తనాల పంపిణీ

ఖమ్మం, అక్టోబర్ 6: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ (ఐ సి ఏ ఆర్-ఐ ఐ ఓ ఆర్) హైదరాబాద్ సహకారంతో రైతులకు పొద్దుతిరుగుడు హైబ్రిడ్ SUNFH-1 విత్తనాల పంపిణీతో పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం కేవీకే ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా.టి.భరత్ మాట్లాడుతూ.. పొద్దుతిరుగుడు సాగులో సమతుల్య ఎరువుల యాజమాన్యం, సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు (ఐ సి ఎం) పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. శాస్త్రీయ సాగు పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ సమస్యల పరిష్కారానికి కేవీకే అందిస్తున్న సాంకేతిక సలహాలు, సూచనలు, విస్తరణ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 60 మంది రైతులకు SUNFH-1 పొద్దుతిరుగుడు హైబ్రిడ్ విత్తనాలను పంపిణీ చేశారు.


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.